
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | 5





వసూళ్లు అంతంతే!

- లక్ష్యానికి దూరంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు
- కొవ్వూరు, మండపేట మున్సిపాలిటీల్లో అత్యధిక వసూళ్లు

6



నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతి, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500 మందికిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

6



6

అదిగో.. శ్రీరామగిరి

రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశమిది



6

కర్పూర అధరహో!



7

రూ.171.33కోట్లతో సత్యదేవుడి ఆలయ బడ్జెట్

టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితా

9 వరకూ అభ్యంతరాలు స్వీకరణ

డీఎస్ఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాపై ఈ నెల 9వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని డీఈవో కంది వాసుదేవ రావు తెలిపారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యా శాఖ పరిధి లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించి గత నెల 10న, 25న రెండుసార్లు అభ్యంతరాలు స్వీకరించి సరి చేయడం జరిగిందన్నారు. ఎస్జీటీలు సమాన క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కోసం సబ్జెక్టు వారీగా, స్కూల్ అసిస్టెంట్ సమాన క్యాడర్ నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతికి తాత్కాలిక సీనియారిటీ జాబితాలను రూపొందించామని చెప్పారు. ఆ జాబితాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ www.deoeluru.org వెబ్‌సైటులో, నోటీసు బోర్డులో ఈ నెల 3 నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు.వాటిలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ లోగా తగు ఆధారాలతో ఏలూరు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఎస్ఈవో పేర్కొన్నారు.

రేపు, ఎల్లుండి రాష్ట్రస్థాయి

కుస్తీ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కుస్తీపోటీలు ఈనెల 5, 6 తేదీల్లో దివాన్‌చెరువులో జరుగుతాయని రోటరీక్లబ్ రాజమండ్రి చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా, ఐకాన్ అధ్యక్షుడు వెంకట్, స్పోర్ట్సు చైర్మన్ శంకర్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అండర్ - 15 బాలురు, బాలికలు, అండర్ - 20 పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు సుమారు 300 మంది రెజ్లర్లు హాజరవుతారని తెలిపారు.విజేతలు రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధిస్తారని అన్నారు.

ఆదమరిస్తే.. అంతే!

టెన్త్.. ఇంటర్.. పరీక్షలు ముగిశాయి.. విద్యార్థులకు దాదాపుగా వేసవి సెలవులు వచ్చేశాయి.. చిన్న తరగతులకు చూస్తే ఒంటిపూట బడులు నడుస్తున్నాయి.. దీంతో ఆనందానికి హద్దే లేకుండాపోతోంది.. ప్రతిరోజు ఈరోజు ఏంటీ అనే ఆలోచనే.. దీంతో చాలా మంది పిల్లలు.. యువత సరదాగా గడుపుదామని నదీ స్నానాల బాటపడుతున్నారు. అయితే ఆదమరుపుగా ఉన్నారో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.. నది ఎంత ప్రశాంతంగా కనిపిస్తుందో ప్రమాదం జరిగిన తరువాత అంతే విషాదాన్ని మిగులుస్తోంది. అందుకే తస్మాత్ జాగ్రత్త.. నదిలో స్నానాలకు దిగినా రక్షణ చర్యలు తీసుకోవాల్సిందే. ఆదమరుపుగా ఉన్నామా మునిగిపోతామంతే..



ఇలాగే రాయించండి : ముక్కొల్లు చెక్‌డామ్ వద్ద హెచ్చరిక బోర్డులు రాయిస్తున్న పోలీసులు



చూస్తుండగానే వెళ్లిపోతార్రు.జాగ్రత్త : తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గురువారం స్నానాలు చేస్తున్న సందర్శకులు

పేరులోనే గోదావరి ఉన్న జిల్లా మనది.. నీటికి లోటు లేదు.. ఆ నీటిలో జరిగే ప్రమాదాలకు కొదువే లేదు. ప్రతి ఏటా 50 మంది వరకూ నదీ ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నది ఏదైనా పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది.. దిగితేనే దాని లోతు తెలుస్తుంది.. ప్రస్తుత వేసవి నేపథ్యంలో నదీ స్నానాలకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.. గోదావరి.. కాలువలు. సముద్రతీర ప్రాంతం ఇలా ఎక్కడపడితే అక్కడ సరదాగా స్నానాలకు క్యూకడుతుంటారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి రోజు వేలాది మంది స్నానాలు ఆచరిస్తుంటారు. ఈ సరదాలో ప్రమాదాలను గుర్తించలేక పలువురు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. ఇటీవల శివరాత్రికి తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరిలో స్నానం చేద్దామని వెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. బుధవారమే చూస్తే కాకినాడ జిల్లాలో కాండ్రకోట, పెద్దనాపల్లి వద్ద ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. వేసవి సెలవుల్లో సరదాకు స్నానాలు సరే కానీ ఆదమరుపుగా ఉన్నామా మిగిలేది మాత్రం కన్నీళ్లే..



ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు : పెద్దనాపల్లిలో మృతదేహాన్ని పట్టుకుని కుటుంబీకుల రోదన

ఈత సరదా..పొంచి ఉన్న ముప్పు

- ప్రమాదకరంగా గోదారి ఘాట్లు
- కాలువలదీ ఇదే పరిస్థితి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- వేసవి తాపంతో పెరిగిన తాకిడి
- బుధవారమే నలుగురు మృతి
- అయినా పట్టని అధికారులు
- ఇకనైనా మేల్కొనాల్సిందే



సరదాలు వద్దు నాయనా : అల్లవరం వద్ద సముద్రతీరంలో చిన్నారుల ఈత సరదా

రక్షణ చర్యలు చేపట్టండి

నదీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. నది లోతు.. జరిగే ప్రమాదం.. తదితర విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలి. కాలువ రేవులు, ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా ఉండే గోదావరి ఘాట్ల వద్ద సచివాలయ పోలీసులు నియమించాలి. కాటన్ బ్యారేజీ కిందకు వెళ్లే దారులన్నీ మూసివేయాలి. ప్రధాన కాలువల్లో జరిగిన ప్రమాదాలతో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. గోదావరి ఘాట్ల వద్ద కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అప్రమత్తంగా ఉంటారు.

ఈత సరదా.. కాదు!

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు/ఆత్రేయపురం: ఉమ్మడి జిల్లాలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం చాలా ఎక్కువ. ఇటు తూర్పుగోదావరి.. అటు కోనసీమ జిల్లాలను అనుకుని గోదావరి ప్రవహిస్తుంది. వేసవి వచ్చిందంటే పిల్లలతోపాటు పెద్దలు గోదావరి స్నానాలకు క్యూకడుతుంటారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ఉంటుంది. ఈ నేపథ్యంలో లోతు ఎక్కువ. కొవ్వూరు గోష్పాదక్షేత్రం.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, అయ్యప్ప ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజీ, జొన్నాడ తదితర ప్రాంతాల్లో స్నానాలు ఎక్కువగా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో ప్రతి ఏటా పర్యాటకులు వేలాదిగా స్నానాలు చేస్తుంటారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో యువకులు మృత్యువాతపడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలిస్తున్నారు. గతేడాది మే నెలలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఎందరో చనిపోయారు. ఊబలున్న చోట పైకి గోదావరి చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది దిగితేనే దాని లోతు తెలిసేది. పుష్కరాల రేవులో చాలామంది పిల్లలు, పెద్దలు లోతు తెలియక దిగి మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. పడవలపై గోదావరి మధ్యలోకి వెళ్లి లంకల్లో దిగి స్నానాలు చేస్తున్నవారున్నారు. అయినా నేటికీ రక్షణ చర్యలు కానరావడం లేదు. రోజురోజుకు సందర్శకులు పెరుగుతున్నా ఏ ఒక్కరూ రక్షణపై దృష్టి సారించడంలేదు.



వేసవి ఉపశమనం..గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరిలో స్నానాలు

కన్నీట.. కాలువలు

పిఠాపురం/ ప్రత్తిపాడు/కిర్లంపూడి/ పెద్దాపురం : కాలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి.. లోతు తెలియకుండా దిగి ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల ఏలేరు,పీబీసీ కాలువలు ఉన్నాయి. వర్షాకాలంలో సుద్దగడ్డ కాలువ ప్రమాదకరంగా ఉంది. ఏలేరు కాలువలో పిడిందొడ్డి, ఎదురొడ్డి, గొల్లప్రోలు కాలువలతోపాటు బల్లకట్టు, భోగాపురం గుమ్మిడిగట్టు రెగ్యులేటర్, గొల్లప్రోలు, చిత్రాడ, నవఖండ్రవాడ, మల్లవరం, యండపల్లి తదితర ప్రాంతాల్లోని పీబీసీ కాలువలు, గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువ, చెందుర్తి, కొడవలి వద్ద పుష్కర, పోలవరం కాలువల వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకుని గత ఐదేళ్లలో 19 మంది మృత్యువాతపడ్డారు. ఏలేశ్వరం ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాదభరితంగా మారింది. పెదశంకర్లపూడి, రౌతుపాలెం,పెద్దిపాలెం, గజ్జనపూడి, యుజేపురం తదితర చోట్ల స్నానాలకు కాలువలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.పొదురుపాక, గజ్జనపూడి, చింతలూరు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. కిర్లంపూడి మండలం ముక్కొల్లు,పెద్దాపురం మండలం కాండ్రకోట ఏలేరు బెడ్ రెగ్యులేటర్ల వద్ద ప్రమాదకరంగా ఉంది. రెండు చోట్లా ఇప్పటివరకూ 30 మంది మృత్యువాతపడడమే అందుకు ఉదాహరణ.

ప్రమాదాల తీరం..

అల్లవరం : సముద్ర తీరం చూస్తే ఎవరికి స్నానం చేయాలనిపించదు మరి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అల్లవరం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో సముద్రతీర ప్రాంతాలు ఉన్నాయి. వేసవి కావడంతో కొందరు యువకులు సముద్ర స్నానాలకు దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అల్లవరం, కాకినాడ సముద్ర తీర ప్రాంతాల్లో పలు ప్రాంతాల నుంచి కుటుంబీకులతో బీచ్‌కు చేరి సముద్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఓడలరేవు తీరంలో మెరైన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నా కొందరు యువత వారిని కాదని లోతుకు వెళ్లి మృత్యువాతపడుతున్నారు. తీరాన అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతి.



కురుకూరులో భూ రీసర్వేపై అధికారులకు సూచనలు చేసి.. సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి..

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయండి

రెండో దశ రీ సర్వే పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

దేవరపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూముల సమగ్ర కొలతల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని ఎటువంటి సమస్యలు లేకుండా రీసర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. దేవరపల్లి మండలం కురుకూరు పొలాల్లో గురువారం సాయంత్రం రెండో దశ రీసర్వే పనులు పరిశీలించారు. రైతులు, అధికారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం రైతు సేవాభవనంలో రైతులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వేకు సంబంధించి పలు ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా రెండో దశ రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. గతంలో చేపట్టిన రీసర్వేపై కొలతల్లో వ్యత్యాసాలు, ఇతర అభ్యంతరాల నేపథ్యంలో సీసీఎల్ కమిషనర్ ఆదేశాలను అనుసరించి క్షేత్రస్థాయిలో రెండో దశ రీసర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రికార్డులను సక్రమంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కురుకూరులో 1050 మంది రైతులకు చెందిన 25 వేల ఎకరాల భూమిలో 80 శాతం తప్పులతడకలుగా రీసర్వే జరిగిందని రైతులు యలమాటి భాస్కరరావు, కొయ్యలమూడి అచ్యుతరాయుడు, కలగర శ్రీనివాస్, కొయ్యలమూడి శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తప్పుల తడకలుగా ఎందుకు నమోదయ్యాయని వీఆర్వోను ప్రశ్నించారు. ఆ తప్పులు మరలా జరగకుండా రీసర్వే చేయాలన్నారు. ప్రస్తుతం రెండు టీమ్‌లు రీసర్వే చేస్తున్నాయని రైతుల కోరిక మేరకు మూడో టీమ్ కూడా ఏర్పాటు చేసి రీసర్వే త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చినరాముడు, ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఐటీఎస్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ డిల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, రైతులు బేతిన వెంకట్రావు,మల్లెల వెంకటేశ్వరరావు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో 'తూర్పు' భేష్

- పండ్ల తోటల పెంపకంలో ప్రథమ
- పల్లె పండుగలో రెండో స్థానం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో రాష్ట్రంలోనే మెరుగైన స్థానాల్లో తూర్పుగోదావరి నిలిచిందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా ప్రగతి నివేదికను ఆమె గురువారం విడుదల చేశారు. 11,754 కుటుంబాలకు 100 రోజుల పనిదినాలను కల్పించడం జరిగిందని.. దీంతో లేబర్ బడ్జెట్‌లో 102.07 శాతంతో రాష్ట్రంలో తూర్పుగోదావరి ఆరో స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 1 లక్షా 247 కుటుంబాల్లో 1,32,954 మంది ఉపాధి కూలీలకు 51,88,790 పనిదినాలు కల్పించడం ద్వారా రూ.131కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. ఎస్సీ కుటుంబాలకు 18.67 లక్షలు, ఎస్టీ కుటుంబాలకు 1.02 లక్షల పనిదినాలు కల్పించామన్నారు.రూ.225 రోజువారీ వేతనం చెల్లించామన్నారు. 2025-26 ఏడాదిలో సగటున దినసరి వేతనం రూ.300 వరకూ పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. పల్లె పండుగలో జిల్లాలో 149.50 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లను రూ.72 కోట్లతో నిర్మించి రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో, పాడి రైతులకు సంబంధించి 583 పశువుల షెడ్లను రూ.9.85 కోట్లతో నిర్మించి రాష్ట్రంలో ఏడో స్థానంలో, 373 మంది సన్న, చిన్నకారు రైతులకు రూ.643.50 ఎకరాల్లో రూ.87.90 లక్షల వ్యయంతో పండ్ల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడం ద్వారా ప్రథమ స్థానంలో నిలిచామన్నారు.112 సాగునీటి చెరువుల(ఫారం పాండ్లు)ను రూ.55లక్షలతో పూర్తి చేశామన్నారు.

పంచ ప్రాధాన్యతలు

2025-26లో పంచ ప్రాధాన్యతలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొన్నామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపాధి హామీ కూలీలకు 35 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సగటున ప్రతి పనిదినానికి రూ.300 వేతనం అందే విధంగా మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి నిధులతో వేసవిలో పశువులకు నీటి సదుపాయ కల్పనకు 157 ప్రదేశాల్లో రూ.33 వేలతో పశువుల నీటి తొట్టెలను ఏప్రిల్ 10లోగా పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. 3 నెలల్లో 1,500 ఫారం పాండ్లను 9 మండలాల్లో నిర్మిస్తామన్నారు. డెల్టా మండలాలకు సంబంధించిన పంట కాలువలు, మైనర్, మేజర్ కాలువల్లో పూడిక తీయడానికి 2500కిలో మీటర్లను లక్ష్యంగా నిర్ణయించామన్నారు. 392 చెరువుల్లో పూడిక తీతకు పరిపాలన ఆమోదం ఇచ్చామన్నారు. జిల్లాలో రూ.15 లక్షల చొప్పున నిధులతో స్మశాన వాటికలను అభివృద్ధి చేయడం కూడా ప్రాధాన్యంగా తీసుకున్నామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు.



కాకినాడలో తనిఖీ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

పరీక్షలు జాగ్రత్తగా రాయండి

నన్నయ వర్సిటీ పరిధిలో డిగ్రీ,లా, బీఈడీ పరీక్షలు జరుగుతున్నాయి.. ఈ మేరకు వీసీ ప్రసన్న శ్రీ పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు. కంగారుపడకుండా పరీక్షలు రాయాలని.. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. కాకినాడలోని పీఎస్ లక్ష్మి, ప్రగతి డిగ్రీ కళాశాలల్లో గురువారం ఇలా ఆకస్మిక తనిఖీలు చేశారు.

ఇసుక రవాణాకు కొత్త కష్టాలు

మొరాయించిన డివైడర్లు.. వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ర్యాంపుల్లో డివైడర్‌లు మొరాయించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఇసుక రవాణాకు సంబంధించి నూతన విధానాన్ని అమలు చేసింది. ఇసుక రవాణాచేసే వాహనాన్ని ముందుగా ఫొటో తీయాలి. వివరాలు రిజిస్ట్రేషన్, ఇసుక లోడింగ్ చేసుకున్న తరువాత మరోసారి వాహనం ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. దీంతో పాటు నూతన ప్రక్రియలో వీఆర్వో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో డివైడర్‌లు మొరాయిండం, వీఆర్వోలు లాగిన్ అవ్వక పోవడంతో మధ్యాహ్నం వరకు బిల్లులు మంజూరు కాక ఇసుక రవాణాకు అడ్డంకిగా మారింది. మధ్యాహ్నం 12 గంటలకు వరకు ఇసుకకు వచ్చిన లారీలన్నీ ర్యాంపుల్లోనే నిలిచిపోయాయి. మండలంలోని వాడపల్లి ర్యాంపులో బిల్లులు జనరేట్ కాకపోవడంతో ఇసుకకు వచ్చిన లారీలు వెనుదిరిగాయి. కుమారదేవం ఓపెన్ రీచ్‌లో సాయంత్రం వరకు బిల్లులు మంజూరు కాలేదు. కొవ్వూరు, ఏరినమ్మ, ఔరంగాబాద్, ఆరికిరేవుల, దండకుంట ర్యాంపుల్లోనూ ఇదే సమస్య తలెత్తింది. వాడపల్లి, కుమారదేవం ర్యాంపుల వద్ద లారీలు బారులు తీరాయి.బిల్లులు మంజూరుకు సంబంధించి డివైడర్లలో సాంకేతిక సమస్యలతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం నుంచైనా నూతన విధానం సక్రమంగా అమల్లోకి రావాలని నిర్వాహకులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు.




శ్రీరామగిరిలోని యాగ రామాలయం

అదిగో... అదిగో... శ్రీరామగిరి



శ్రీరామగిరి... ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ఏకైక దక్షిణముఖ ఆలయమిది. సాక్షాత్తూ రామలక్ష్మణులు ఇక్కడ సంచరించినట్టు రామ కథ చెప్తోంది. పురాణంలో శ్రీరామగిరి అతి ముఖ్యమైన ఘట్టంలో ఒకటిగా ఉంది. రావణుడు సీతమ్మవారిని అపహరించిన క్రమంలో ఆమె జాడ కోసం రామలక్ష్మణులు అడవిబాట పడతారు. ఆ సమయంలో కొన్ని మూగజీవాలు చేసిన సంజ్ఞలతో సీతమ్మవారిని రావణుడు అక్కడి నుంచి దక్షిణ దిశగా అపహరించినట్టు రామలక్ష్మణులకు అర్థమవుతుంది. దీంతో ఆ దిశగా అన్వేషించిన తర్వాత సీతమ్మ కోసం వెళ్లే ముందు గోదావరి నది ఒడ్డున రామలక్ష్మణులు ఓ ఎత్తైన కొండపై చాతుర్మాస్య దీక్ష చేస్తారు. దీంతో ఆ ప్రాంతం శ్రీరామగిరిగా వినుతికెక్కింది.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలోనే మాతంగి మహర్షి, ఆయన శిష్యులు, రుషులు శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు వాల్మీకి రామాయణంలోని అరణ్యకాండలో పొందుపర్చిన శ్రీరామదివ్య చరిత ద్వారా తెలుస్తోంది. మరెక్కడా లేనంత స్థాయిలో అత్యంత సుందరంగా ఆ విగ్రహాలను తీర్చిదిద్దడంతో శ్రీరామగిరిలో ప్రతిష్ఠించిన రాముడు సుందరరాముడిగా పిలవ బడుతుంటాడు. అంతే కాదు రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలో ఆలయం నిర్మించినందునే యాగ రామాలయంగా ప్రసిద్ధి పొందింది. ఇంతటి విశిష్టత కలిగి ఉన్న ఈ ఆలయం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ వర రామచంద్రపురం మండలంలో 80 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై నిర్మితమైంది. ఇక్కడప్రతిఏటా రాముని కల్యాణాన్ని ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

రాముని వనవాసంలో ముఖ్య భూమికలైన జటాయువు, రేఖపల్లి, ఉష్ణగుండాలు, వాలిసుగ్రీవులు, రామలక్ష్మణుల వృక్షాలు, శ్రీరామపాద ముద్రలు, చుక్కనపల్లి లాంటి చారిత్రక దృశ్యాలను భక్తులు నేటికీ అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు.

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రికి కూతవేటు దూరంలో ఉన్న నేటి ఎటపాకే నాటి జటపాక. సీతారాముడు వనవాసం చేస్తున్న సందర్భంలో జటాయువు రాముని వద్దకు వచ్చి తాను దశరథుని శిష్యుడిగా పరిచయం చేసుకుంటుంది. తదుపరి రామా నీవు ఆశ్రమంలో లేని సమయంలో సీతమ్మ వారికి రక్షణగా ఉంటానని మాటిస్తాడు. ఆ మేరకు మాయాలీలుడైన రావణుడు సీతమ్మవారిని అపహరించుకెళ్తున్న సమయంలో అడ్డుపడి శక్తి వంచన లేకుండా యుద్ధం చేస్తాడు. అయితే అత్యంత బలశాలి అయిన రావణుడి ఖడ్గం ధాటికి జటాయువు రెక్కలు, కాళ్లు తెగిపోతాయి. ఓ రెక్క జటపాకలోను, మరో రెక్క రేక్కపల్లిలోను పడిపోతాయి. చివరకు రెండు కాళ్లూ తెగిపోయిన జటాయువు యుద్ధంలో అలసిపోయి రాముడిని స్మరిస్తూ నేలకూలుతుంది. జటపాక నేడు ఎటపాకగా, రెక్కపల్లి వర రామచంద్రపురం మండలంలోని రేఖపల్లిగాను, చొక్కిపోయి నేలకూలిన ప్రదేశం చొక్కనపల్లిగా పిలవబడుతున్నాయి.

రావణుడి అకృత్యాన్ని రాముడికి చెప్తూ జటాయువు తుది శ్వాస విడుస్తాడు. దీంతో జటాయువు అంత్య సంస్కారాలు చేయడం రామలక్ష్మణులు తమ విధిగా భావిస్తారు. ఈ క్రమంలో లక్ష్మణుడు గోదావరి ఒడ్డున చితి పేర్చగా రాముడు చితికి నిప్పు అంటిస్తాడు. దశరథుడు సైతం పొందని ఘన మైన రామునిచేత అంతిమ సంస్కారాలు పొందిన పుణ్యాత్ముడిగా జటాయువు నిలిచాడు. రాముడు చితికి నిప్పు అంటించిన ప్రదేశంలో (గోదావరి ఒడ్డున) రాళ్లపై రామపాద ముద్రలు నేటికీ కనిపిస్తాయి.


ఎటపాకలోని జటాయువు మందిరం

- భారతదేశంలోనే ఏకైక దక్షిణ ముఖ ఆలయం
- సాక్షాత్తూ రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశమిది
- ఉష్ణగుండాలు, ఎటపాక, రేఖపల్లి
- రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న ఆధ్యాత్మిక ప్రదేశాలివి





తమ ప్రాంతంలో సంచరించిన రామలక్ష్మణులకు గుర్తుగా ఆదివాసీలు వరరామచంద్రపురం మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో రామ, లక్ష్మణుల పేరిట రెండు టేకు చెట్లు నాటినట్టు చరిత్ర చెప్తోంది. ఏపుగా పెరిగి వున్న అవి నేటికీ మనకు కనిపిస్తాయి.

ఎటపాక మండలం గుండాల సమీపాన గోదావరి తిన్నెలో ఉష్ణ గుండం నేటికీ మనకు కనిపిస్తుంది. ఆ గుండం నుంచి ఎప్పుడూ వేడి నీరే వస్తుంది. సీతమ్మ వన వాస సమయంలో శీతాకాలం రావడంతో గోదావరి నీరు చల్లగా ఉండి స్నానమాచరించేందుకు ఆమె ఇబ్బంది పడడాన్ని లక్ష్మణుడు గుర్తించి గోదావరి ఇసుక తిన్నెలోకి బాణాన్ని సంధిస్తాడు. ఆ ప్రదేశంలో ఏర్పడిన గుండం నుంచి వేడినీరు వచ్చినట్టు ప్రతీతి. ఇప్పటికీ ఆ ప్రదేశాన్ని స్థానికులు భక్తుల సందర్శనార్థం ముక్కోటి, శ్రీరామనవమి పర్వదినాల్లో అందుబాటులోకి తెస్తున్నారు.




అన్నదమ్ములైన వాలి, సుగ్రీవులు రామాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తూర్పు కనుమల్లో తల దాచుకోవ డంతో అక్కడున్న కొండలను వాలిసుగ్రీవులు కొండలుగా పిలుచుకుంటారు.


వర రామచంద్రపురం మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న శ్రీరామగిరి గ్రామం




శిశిరం... నవ వసంతం

ఆకురాలు కాలం (శిశిరం) వెళ్లింది.. చిగురించే కాలం (వసంతం) వచ్చింది... నవ వసంతంలో చెట్లు శోభను సంతరించుకున్నాయి.. కాకినాడ పిండాల చెరువు వద్ద కొద్ది రోజుల క్రితం ఆకులన్నీ రాలి కళావిహీనంగా కనిపించిన రావి చెట్టు నేడు కళకళలాడుతూ కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. **ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ**


కాకినాడ బీచ్ రోడ్డులో గో కార్టింగ్ రేస్ ట్రాక్

గో... గో... రయ్... రయ్...

- కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్
- సిద్ధమవుతున్న ట్రాక్
- ఈ నెలలోనే అందుబాటులోకి...

కాకినాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడికి వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తు న్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ వినోదాన్ని పంచేలా ఎమ్యూజ్‌మెంట్ పార్కును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పర్యాటకులకు ఆటవిడుపుగా ఉండేలా.. రాష్ట్ర పర్యాటక శాఖ, స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. తాజాగా కాకినాడ, పరిసర ప్రాంతవాసులకు గోకార్ట్ కార్ రేసింగ్ అందుబాటులోకి రానుంది. కాకినాడ బీచ్‌కు దగ్గరలో సుమారు ఐదున్నర ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పనులు పూర్తి కావొస్తున్నాయి.



గో కార్టింగ్‌తో పాటు 46 ఎమ్యూజ్‌మెంట్ యాక్టివిటీస్ వస్తున్నాయి. అందులో హ్యూమన్ గైరో, క్రికెట్, 50 ఫీట్ జెయింట్ స్వింగ్, వీఆర్ గేమ్స్, గో కార్టింగ్‌లో అత్యంత అధునాతన వాహనాలను తీసుకొస్తున్నారు. అన్ని రకాల ఫుడ్ కౌంటర్స్, మెకనైజ్డ్ క్రికెట్, పెయింట్ బాల్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ వంటి క్రీడలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. పర్యాటకులకు ఎంట్రీ ఫ్రీ అని, రూ.300తో గోకార్టింగ్ యాక్టివిటీ మొదలవుతుందని గోకార్టింగ్ ఏరియా మేనేజర్ శ్రావణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


జోరుగా నిర్మాణ పనులు

నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన


పోలీసులకు సూచనలిస్తున్న సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతీ, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500కిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

రాజమహేంద్రవరం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి వంటి రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు సెంట్రల్ జైలు రోడ్డులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించాలని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. గురువారం ఆమె ఏర్పాట్లను పరిశీలించి పోలీసు తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సంస్కృతి, కళలకు పునరుజ్జీవం వచ్చిందన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకురావాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. సెంట్రల్‌జైలురోడ్డులో శుక్రవారం నిర్వహించనున్న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు 500మంది కళాకారులు నమోదు చేసుకున్నారన్నారు. వారి చిత్రకళలు ప్రదర్శనలో ఉంటాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళలు, సంప్రదాయాలకు ఆదరణ లభించలేదని, వాటి పునరుద్ధరణకు ఏ ప్రయత్నమూ జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎంతో గొప్ప కళాకారులు, పద్మ అవార్డుల వంటి ఉన్నత పురస్కారాల గ్రహీతలకు సైతం అప్పట్లో సముచిత గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కమిషన్ డైరెక్టర్ అండ్ సీఈవో మల్లిఖార్జు నరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, పాల్గొన్నారు.

చిత్ర కళా ప్రదర్శన ప్రదేశం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలురోడ్డులో సెంట్రల్ జైలు నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో.

సమయం: ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు. ప్రవేశం ఉచితం.

ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ జంక్షన్ వరకూ సెంట్రల్‌జైలు రోడ్డులో లాలాచెరువు వైపునుంచి వచ్చే కార్లు, బస్సులు, ఇతరవాహనాలు క్వారీ మార్కెట్, మార్కెట్‌యార్డు రోడ్డు, కంబాల చెరువు గుండా ఆర్ట్స్ కళాశాల చేరుకుని పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలు సీటీఆర్ఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కి అడ్డం లేకుండా నిలపవచ్చు. కంబాలచెరువునుంచి లాలాచెరువు వెళ్లే వాహనాలు మార్కెట్ యార్డు రోడ్డులో క్వారీ మార్కెట్ సెంటర్‌కి వెళ్లి అక్కడినుంచి లాలాచెరువు చేరుకోవాలి. శుక్రవారం రాత్రి 10గంటల వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

వసూళ్లు అంతంతే!

లక్ష్యానికి ఎంతో దూరంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పన్నుల వసూలే లక్ష్యంగా కొన్ని నెలలుగా శ్రమిస్తున్న మున్సిపల్ అధికారులు ఆ లక్ష్యానికి చేరువయ్యారా? మొండి బకాయిలను వసూలు చేయగలిగారా? మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఈ సందర్భంగా అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేశారా? మున్సిపాలిటీలకు గుదిబండగా మారిన బకాయిల భారాన్ని కాస్తయినా 2024-25 ఆర్థిక సంవత్సరంలో దించుకోగలిగారా? అంటే లేదు అనే సమాధానమే వినిపిస్తోంది. పన్నుల వసూలులో కొన్ని మున్సిపాలిటీల్లో వెనుకబడ్డారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కీలకమైన కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 50శాతం మేర మాత్రమే వసూళ్లు చేయడమే నిదర్శనం.

కాకినాడ జిల్లాలో...

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన గడువు తీరింది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో కాకినాడ జిల్లాలోని పలు మునిసిపాలిటీలు వెనుకబడ్డాయి. ప్రభుత్వం 50శాతం వడ్డీ మాఫీ కల్పించినా ప్రజల నుంచి అంతంతమాత్రమే స్పందన రాగా, కొన్ని మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితం లభించింది. కాకినాడ నగరపాలక సంస్థలో కొన్ని చోట్ల కుళాయిల కనెక్షన్లు కట్ చేసినా.. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో దుకాణాలను సీజ్ చేసినా 50 శాతంలోపు మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతో పాటు ఏలేశ్వరం, గొల్లప్రోలు వంటి రెండు మేజర్ నగర పంచాయతీలు కూడా ఉన్నాయి. వీటిలో గొల్లప్రోలు నగర పంచాయతీ 76.71శాతం, పెద్దాపురం 65.81శాతంతో లక్ష్యానికి కాస్త చేరువయ్యాయి. కొన్ని మున్సిపాలిటీల్లో వసూళ్లశాతం తక్కువగా ఉండడానికి దీర్ఘకాలంగా ఉన్న కోర్టు కేసులు కూడా మరో కారణం. మొండిబకాయిదారుల ముక్కుపిండి వసూలు చేస్తామని చెప్పిన నగరపాలక రెవెన్యూ అధికారులు.. వెనుకబడ్డారు. సెలవు దినాల్లో సైతం పన్ను చెల్లింపు కౌంటర్లు తెరిచినా.. 50 శాతానికి చేరువకాలేకపోయారు. కాకినాడ నగరపాలక సంస్థను పరిశీలిస్తే.. ఇక్కడ పన్ను వసూలు లక్ష్యం రూ.110.99 కోట్లు. అందులో పాతబకాయిలు రూ.56.42 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత బకాయిలు రూ.54.58కోట్లు.. ఇప్పటివరకు రూ.52.97కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.58.02 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 47.72 శాతం మాత్రమే వసూలైంది. కనీసం 50 శాతానికి కూడా చేరువకాలేకపోయింది. ఇక్కడ పన్నుల వసూలుపై నగరపాలక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌కు పన్ను వసూలు బాధ్యత అప్పగించిన కమిషనర్ భావన ప్రతి శనివారం పన్ను వసూళ్ల ప్రగతిపై సమీక్షించేవారు. అంతేకాదు.. పన్ను వసూలుపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేపట్టారు. నగరంలో 200కిపైగా కుళాయి కనెక్షన్లను తొలగించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని 11కిపైగా దుకాణాలను సీజ్ చేశారు. పన్నులు చెల్లించని ఖాళీస్థలాల వద్ద జప్తు చేస్తామంటూ హెచ్చరిక బ్యానర్లు తగిలించారు. ఆటోల్లో ప్రచారం, ఐవీఆర్ఎస్ ద్వారా ఇంటి యజమానుల మొబైల్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం పాత బకాయిలు రూ.5.58 కోట్లు, ప్రస్తుత బకాయిలు రూ.4.59కోట్లు కలిపి మొత్తం పన్ను బకాయిలు రూ.10.17కోట్లు కాగా, అందులో రూ.4.97కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.5.20 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 48.90శాతమే ఈ మున్సిపాలిటీలో పన్నులు వసూలయ్యాయి. గొల్లప్రోలు నగర పంచాయతీలో పన్ను వసూల లక్ష్యం రూ.1.82 కోట్లు కాగా రూ.1.39కోట్లు వసూలైంది. 76.71 వసూలు శాతం నమోదైంది. కాకినాడ జిల్లాలో ఈ నగర పంచాయతీయే పన్నుల వసూలులో ముందంజలో ఉంది. సామర్లకోట మున్సిపాలిటీలో పన్నుల వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు రూ.8.78 కోట్లు కాగా అందులో రూ.4.47కోట్లు వసూలైంది. ఇంకా రూ.4.31 కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ 50.93శాతం పన్నులు వసూలయ్యాయి. పెద్దాపురం మున్సిపాలిటీలో పన్ను వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు కలిపి రూ.7.18కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. రూ.2.45కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 65.81 శాతంగా నమోదైంది. ఏలేశ్వరం నగర పంచాయతీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.2.61కోట్లు కాగా అందులో రూ.1.49కోట్లు వసూలయ్యాయి. రూ.1.12కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ పన్ను వసూలు శాతం 57.12. ఇక తుని మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు మొత్తం రూ.7.28 కోట్లుకాగా, రూ.5.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.19కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 69.92 శాతం పన్ను వసూలైంది.

తూర్పుగోదావరి జిల్లాలో...

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి పాత, ప్రస్తుత పన్ను బకాయిలు రూ.132.32 కోట్లు కాగా రూ.71.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.61.22 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 53.73 శాతం పన్ను వసూలు నమోదైంది. కొవ్వూరు మున్సిపాల్టీ మొత్తం పన్నుబకాయిలు రూ.4.56 కోట్లు కాగా రూ.3.69కోట్లు వసూలయ్యాయి. రూ.0.86కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 81.04 శాతం వసూలైంది. నిడదవోలు మున్సిపాల్టీకి సంబంధించి మొత్తం పన్ను బకాయిలు రూ.8.47కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. ఇంకా రూ.3.75 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 55.72 శాతం వసూలైంది.

కోనసీమ జిల్లాలో...

అమలాపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత ఆస్తి పన్ను బకాయిలు రూ.14.72కోట్లు కాగా.. రూ.9.01కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.5.71 కోట్ల మేర బకాయిలున్నాయి. ఇక్కడ 61.94 శాతం పన్ను వసూలయ్యాయి. రామచంద్రపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.7.65 కోట్లు కాగా వసూలైంది రూ.4.93కోట్లు, వసూలు కావాల్సింది రూ.2.72 కోట్లు ఇక్కడ పన్ను వసూలు శాతం 64.46. మండపేట మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.8.37 కోట్లు కాగా వసూలైంది రూ.6.42, వసూలు కావల్సింది రూ.1.95 కోట్లు, ఇక్కడ పన్నువసూలు శాతం 76.73 శాతం. ముమ్మిడివరం నగర పంచాయతీలో పన్ను వసూలు లక్ష్యం రూ.1.81కోట్లు కాగా రూ.1.37 కోట్లు వసూలైంది. రూ.0.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 75.42 శాతం.


మండపేట మున్సిపాలిటీ

రాష్ట్రంలో కొవ్వూరుకు ఆరు.. మండపేటకు పదో స్థానం

మండపేట, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు మున్సిపాలిటీకి ఆరో స్థానం లభించింది. ఇక్కడ 81.04 శాతం సాధించి రికార్డు సృష్టించింది. మొత్తం రూ.4.56 కోట్ల లక్ష్యానికిగాను రూ.3.69 కోట్లు వసూలయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటలో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో పదో స్థానాన్ని పొందింది. ఇక్కడ 76.73 శాతం సాధించింది. మొత్తం రూ.8.37 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యంకాగా రూ.6.42 శాతం వసూలైంది. కోనసీమ జిల్లాలో మండపేటకు పన్నుల వసూళ్లలో ప్రథమ స్థానం లభించిందని మున్సిపల్‌కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు.

కర్పూర ధర అధరహో

- గరిష్ఠంగా రూ.500 పైమాటే
- ఎగుమతులు పెరిగాయి..

దిగుమతులు తగ్గాయి



రావులపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలో మెట్ట రైతులు అరటిసాగులో కర్పూర రకం అరటిని ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఈ రకం అరటిగెలలు ఎగుమతులు అవుతుంటాయి. అక్కడి వ్యాపారులు గెలల కొనుగోలు కోసం వచ్చిన సమయంలో రైతులకు ధరలు అనుకూలంగా ఉంటాయి. రెండు నెలల క్రితం అరటి ధరలు బాగా పతనం కావడంతో రైతులు దిగాలు పడ్డారు. కాగా మార్చి మొదటివారం నుంచి కర్పూర రకం అరటికి డిమాండ్ పెరిగింది. అమ్మవారి జాతర్లు, తీర్థాలు, శుభ ముహూర్తాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు ఉండటంతో రోజురోజుకీ ధర పెరిగి రైతులకు ఊరట కలిగించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై అరటి గెలలను తీసుకువచ్చి విక్రయిస్తారు. జనవరి నుంచి మొదలుకుని మార్చి మొదటి వారం వరకూ కర్పూర రకం అరటి గెల రూ.200 నుంచి రూ.250 వరకూ మాత్రమే పలకడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కాగా మార్చి మొదటి వారం నుంచి గరిష్ఠంగా కర్పూర రకం అరటి గెల రూ.500 పలుకుతుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. దిగుబడి పుష్కలంగా ఉన్న సమయంలో ధర లేదు.. దిగుబడి తగ్గిన సమయంలో ధర పలుకుతుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక అరటి మార్కెట్ యార్డు నుంచి ఒడిషా, భువనేశ్వర్, కటక్, విశాఖపట్నం, తెలంగాణాతో పాటు పలు ప్రాంతాలకు నిత్యం 10వేల కర్పూర రకం అరటి గెలలు ఎగుమతి అవుతున్నాయి.

గోలి శ్యామలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గోలి శ్యామల జనవరి నెలలో విశాఖపట్నం నుంచి సముద్రంలో ఈదుతూ కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు విజయవంతంగా చేరారు. ఆమె సాహసాన్ని అభినందిస్తూ ఓల్డ్ ఓపెన్ వాటర్ అసోసియేషన్ ప్రశంసాపత్రం అందజేసింది. ఈ నేపథ్యంలో శ్యామల గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 150 కిలోమీటర్లు సముద్రంలో ఈదుతూ గమ్యాన్ని చేరుకోవడం గొప్ప విశేషమని కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



శ్యామలను అభినంధిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



రూ.171.33కోట్లతో
సత్యదేవుడి ఆలయ బడ్జెట్

- రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు పింఛన్లు, ఇతర ఉద్యోగుల జీతాలకు రూ.46.25కోట్లు
- ప్రసాదం తయారీ ముడిసరుకులకు రూ.25కోట్లు ● ఉత్సవాలకు రూ.1.57కోట్లు
- ప్రసాదం ప్యాకర్లు, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణుల రెమ్యునరేషన్‌కు రూ.19.70 కోట్లు
- భక్తుల సౌకర్యాలకు రూ.7.64కోట్లు ● ప్రభుత్వానికి వివిధ చెల్లింపుల ఖర్చు రూ.23.30కోట్లు
- ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.171.33కోట్లతో ఆలయ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బడ్జెట్‌కు అనుగుణంగానే వ్యయం చేయాల్సి ఉంటుంది. వీటిలో 3వ వంతు రూ.46.25కోట్లు రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల చెల్లింపులకు కేటాయించారు. రెమ్యునరేషన్ పద్ధతిపై పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు, వ్రతపురోహితులు, ప్రసాదం ప్యాకర్లకు రూ.19.70కోట్లు చెల్లింపునకు ఆమోదం లభించింది. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ తదితర ఉత్సవాల నిర్వహణకు ఈఏడాదిలో రూ.1.57కోట్ల వరకు ఖర్చుచేసుకునే వీలు కల్పించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే శానిటేషన్ నిర్వహణ, హౌస్‌కీపింగ్, చలువపందిళ్ల ఏర్పాటు, తదితర వాటికి రూ.7.64కోట్లు మంజూరయ్యాయి. రూ.1.63 కోట్లు విద్యుత్‌బిల్లుల చెల్లింపు, నిర్వహణ, ఎలక్ట్రికల్ గూడ్స్ కొనుగోలు, నీటిసరఫరాకు రూ.1.63 కోట్లు కేటాయింపులు జరిగాయి. ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు రూ.1.16కోట్లు, రూ.5.03కోట్లతో దత్తత ఆలయాలు, విద్యాసంస్థల నిర్వహణ, వేదపాఠశాల, వైద్య సదుపాయాలకు వెచ్చించాలని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.5.35కోట్లు ఆలయ భద్రతకు విధులు నిర్వహించే హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుకు చెల్లించనున్నారు. రూ.23.30 కోట్లను సీజీఎఫ్, ఆడిట్ ఫీజు ఇతర పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేందుకు కేటాయించారు. భక్తుల సౌకర్యాలకోసం వివిధ నిర్మాణాలకు రూ.4కోట్లు, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్ కోసం రూ.5కోట్లు కేటాయించారు. రూ.6.43కోట్లను అన్నదాన విభాగం నిమిత్తం మంజూరయ్యాయి. వీటితో ప్రావిజన్స్, కూరగాయల కొనుగోలు, అన్నదాన విభాగ సిబ్బంది జీతాలకు ఆమోదం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఆదాయానికి వ్యయానికి సరిచూసుకుని రూ.3కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా చేయాలని సూచించారు.



రాములోరి కల్యాణానికి శాస్త్రోక్తంగా పందిరిరాట వేస్తున్న పండితులు, పాల్గొన్న ఈవో

రత్నగిరి రామయ్య కల్యాణానికి పందిరిరాట

సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణానికి ప్రారంభ సూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు అర్చకస్వాముల మంత్రోచ్చారణల నడుమ పందిరిరాటను నెలకొల్పారు. ఈనెల 5 నుంచి శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో రామయ్య మూడుముళ్లు వేయనున్నారు. వేడుకలు 13వ తేదీతో ముగుస్తాయి. పందిరరాట కార్యక్రమం లో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి మృతి



రొక్కాల మోజేష్(ఫైల్)

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో భర్త మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పరిధిలోని లీజర్‌కాలనీకి చెందిన రొక్కాల మోజెస్ (34)కు తన భార్యతో వారంరోజుల క్రితం మనస్పర్థలు ఏర్పడ్డాయి. మోజెష్ భార్య వారంరోజుల క్రితం తన పాపను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మోజెష్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. తన ఏడాదిన్నర కుమార్తెకు ఐ మిస్‌యూ బంగారు తల్లి అని స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మోజెష్ మృతి చెందాడు. మోజెష్ ఇంకా నిద్రలేవలేదని స్థానికులు కిటికీలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో తలుపులు పగులగొట్టి చూసేసరికి అప్పటికే మోజెష్ మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

గోపాలపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం మండలంలోని సంజీవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నందిగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చేటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలను నంది గూడెం గ్రామశివారులో ఉన్న కాకర్ల దివాకర్, సంజీవ్ కుమార్‌లకు చెందిన కోళ్లఫామ్‌లో కూలిపని చేసేందుకు పెట్టుకున్నారని అన్నారు. గత సంవత్సర కాలంగా వాళ్ల అదే కోళ్లఫామ్‌లో పనిచేస్తున్నారని, అదే క్రమంలో సతామి కోటల్ (30) భర్త సునీల్ కోటల్ ఇరువురు పనిచేసే క్రమంలో ఈనెల జీతాన్ని సునీల్‌కోటల్ మొదటి భార్యకు రూ.5వేలు వేయడంతో మనస్తాపానికి గురైన సతామికోటల్ తాము నివాసం ఉంటున్న గదికి గెడ వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. దీంతో తోటి కూలీలు తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న సతామికోటల్‌ను కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె చనిపోయిందన్నారు. కోళ్లఫామ్ యజమాని ఇచ్చిన సమాచారం మేరకు నందిగూడెం వీఆర్వో కొత్తపల్లి రాంబాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పి.గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం మండలానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.... మండలంలోని ఓ గ్రా మానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసింది. అయితే బుధవారం మధ్యాహ్నం టీవీ చూడటానికి వెళ్తున్నానని తల్లికి చెప్పి పక్క నివాసానికి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో చుట్టుపక్కలా, బ ంధువులు ఇళ్లవద్ద వాకబుచేసి ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


బాలుడి అదృశ్యం..



పాలూరి వెంకట ఫణీంద్ర (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... కాకరాపల్లి గ్రామానికి చెందిన పాలూరు బెన్నేష్ కుమారుడు వెంకట ఫణీంద్ర రాత్రి 7-30 నిమిషాలకు బహిర్భూమికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా తిరిగి రాకపోవడంతో ఈరోజు ఉదయం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేసినట్టు తెలిపారు.

యువతి అదృశ్యం...



షేక్ నాగీనా (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కాకరపల్లికి చెందిన యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... షేక్ మీరాభికి చెందిన కూతురు షేక్ నాగీనా బుధవారం సాయంత్రం 6.30కు చెవిరింగులు కొనడానికి కోటనందూరు సెంటర్‌కి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సెంటర్‌లో వెతికినప్పటికీ కనబడకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ

కాకినాడరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాను www.deoe g.org వెబ్‌సైట్, నోటీస్ బోర్డులలో ఉంచామని డీఈవో పి.రమేష్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 4నుంచి 11వ తేదీ సాయంత్రంలోపు సరైన ఆధారాలతో విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వాడపల్లిలో బెల్లపు బట్టీలలో విజిలెన్స్ తనిఖీలు

- రూ. 38 లక్షల విలువైన పంచదార, బెల్లం, రసాయనాలు స్వాధీనం



వాడపల్లిలో బెల్లపు బట్టీలలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి, బంగారంపేట గ్రామాలలో బెల్లపు బట్టీలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. బెల్లపు బట్టీలలో కల్తీ జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ అధికారి ఎన్.స్నేహితకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ టి.తాతారావు పర్యవేక్షణలో రెండు బృందాలుగా విజిలెన్స్ అధికారులు కొవ్వూరు మండలంలోని బెల్లపు బట్టీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రం గులు, రసాయణాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.38లక్షల విలువైన పంచదార, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 36,500 కేజీల పంచదార, 2324 కేజీల నాసిరకం బెల్లం, బంగారంపేటలో 2800 కేజీల పంచదార, 486 కేజీల నాసిరకం బెల్లంతోపాటు బెల్లం తయారీలో ఉపయోగించే నిషేధిత రంగులు, ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్లపు తయారీ కోసం పొయ్యిలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి తగులబెడుతున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని, పంచదారను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ మధుబాబు మాట్లాడుతూ కొవ్వూరు పరిసర ప్రాంతాలలో బెల్లంతయారీలో కల్తీ జరుగుతుందని విజిలెన్స్ రీజనల్ అధికారి ఎన్.స్నేహితకు సమాచారం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వాడపలిల్లో బండి శ్రీనివాసరావు బెల్లపు బట్టీ, బంగారంపేటలో ఆనందరావు తనిఖీలు చేపట్టారన్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా బంగారంపేటలో నిర్వహిస్తున్న బెల్లపు బట్టీపై విజిలెన్స్ ఏజి లక్ష్మీనారాయణ, ఫుడ్ రెండవ బృందం వాడపల్లి ఆనందరావు బెల్లపు బట్టీలో గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ మధుబాబు, టి.నాగ వెంకటరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి రుత్తయ్య లీగల్ మెట్రాలజీ అధికారి ప్రసాద్, కార్మిక శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బ్లెలం, పంచదారను రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

- 16 కిలోలు స్వాధీనం



గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ధవళేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి అతడి నుంచి 16కిలోల గంజా యిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. హర్యాణా రాష్ట్రం పరితాబాద్ జిల్లాకు చెందిన జగదీష్ వైజాగ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలుచేసి హర్యాణా రాష్ట్రానికి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ టి.గణేష్ సిబ్బందితో దాడిచేసి జగదీష్‌ను అరెస్టుచేసి అతడి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది. ఈకేసులో నిందితుడిని అరెస్ట్‌చేసిన సీఐ గణేష్, సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ధ్యానం లారీ

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరంనకు ఏటిగట్టు మీదుగా ధాన్యంలోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి కపిలేశ్వరపురం పుష్కరరేవు వద్ద ఏటిగట్టును ఆనుకుని ఉన్న హోటల్‌లోకి దూసుకువెళ్లింది. హోటల్ నిర్వాహకుడు మోటుపల్లి వెంకటరమణ హోటల్‌లోకి బుధవారంరాత్రి సుమారు ఒంటిగంట ప్రాం తంలో లారీ దూసుకుపోవడంతో షెడ్డుతోపాటు వంట సామగ్రి పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయంలో హోటల్‌లో నిర్వాహకులు అక్కడలేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. హోటల్ నిర్వహించే పగలు సమయంలో ఇది జరిగి ఉంటే భారీ నష్టం జరిగేదని పలువురు తెలిపారు. బ్రేకుపడకపోవడంవల్ల అదుపుతప్పి హోటల్‌లోకి లారీ దూసుకుపోయి నట్లు డ్రైవరు సతీష్ తెలిపాడు. దీనిపై కేసు నమోదు కాలేదు.



కపిలేశ్వరపురంలో హోటల్‌లోకి దూసుకెళ్లిన ధాన్యంలోడు లారీ

నాలుగు ఎక్స్‌కవేటర్లు సీజ్

- జిల్లా మైన్స్ అధికారి భూషణ్‌రెడ్డి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం కొత్తతుంగపాడులో సర్వేనెం 792లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్న ప్రదేశాన్ని జిల్లా గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేశారు. తవ్వకాలు చేస్తున్న 4 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశామని జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తవ్వకాలు జరిపిన భూమి వివరాలను పూర్తిగా విచారించిన తర్వాత తవ్వకాలు జరిపిన వారిపై తనిఖీ చేసే అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.

తల్లి, చెల్లిపై దాడి ఘటనలో.. అన్న, వదినపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని కొట్టి గాయపర్చిన అన్న, వదినపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ వి.లలిత తెలిపారు. పట్టణంలోని అచ్చయమ్మకాలనీకి చెందిన మిండల లక్ష్మీ తల్లికి రూ.50వేలు అందా యని తెలుసుకున్న అన్న గంగరాజు, అతని భార్య ముత్తమ్మ ఇంటికి వచ్చారు. గంగరాజు తల్లిని రూ. 50 వేలు కావాలని అడిగాడు, దీంతో ఆమె నిరాకరించడంతో తల్లిని, చెల్లిని గంగరాజు, ముత్తమ్మ ఇటుకరాయితో కొట్టి గాయపర్చారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. మిండల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలిత తెలిపారు.

పి.రాయవరంలో జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



నాటికల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నాటక పరిషత్ ప్రతినిధులు, నాయకులు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలోని మాదేపల్లి శ్రీరామమూర్తి కళా వేదికపై మూడు రోజుల పాటు జరిగే 5వ జాతీయస్థాయి నాటికల పోటీలు గురువారంరాత్రి ప్రారంభమయ్యాయి. సీతారామాలయ పునర్నిర్మాణ పంచమ వార్షికోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రోత్సాహంతో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను పరిషత్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో నాటక పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నీడి జగ్గారావు, నాగాభట్ల బాపన్నశాస్త్రి, సీతారామ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాదేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు కాకినాడ సాయికార్తీక్ క్రియేషన్స్ కళాకారులు ఎడారిలో వాన చినుకు, చిన్న తిరుపతి శృంగార వల్లభ ఆర్ట్స్ కళాకారులు కబ్జా నాటికలను ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండబాబు, ప్రత్యేక అతిథిగా లలితా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాసు విచ్చేశారు. కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పులవర్తి కుమార్, యక్కల ప్రసాద్, కోనసీమజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వాకచర్ల సత్యనారాయణ, బచ్చు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామసత్యనారాయణ ప్రమాణం చేయించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ మాల్స్ వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, అందుకు అనుగుణంగా వ్యాపారాల అభివృద్ధిపై ఆర్యవైశ్యులు దృష్టిపెట్టాలన్నారు. ఆర్యవైశ్య కులస్తులకు రాజకీయాలకతీతంగా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు (బాబ్జీ), నాయకులు బచ్చు శేఖర్, దంగేటి సతీష్, బచ్చు రాజేష్, ఎస్. మోహన్‌కుమార్, ఎ.గంగరాజు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

- అమ్మవారి మంగళ సూత్రాలు, శ్రీనివాసుడి వెండి కిరీటం, చెవులు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

రాయవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చిన బుద్ధి మార్చుకోని వ్యక్తి రెండు ఆలయాల్లో తిరిగి చోరీలకు పాల్పడగా దొంగను రాయవరం పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 31న రాయవరం శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మెడలో బంగారు మంగళ సూత్రాలు అపహరణకు గురయ్యాయి. ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు విశ్వేశ్వరస్వామి ఆలయం ప్రక్కనే ఉన్న పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా దొంగ రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామం ముత్యాలమ్మ ఆలయ సమీపంలో తోరాటి సాయి వరప్రసాద్‌గా గుర్తించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం రాయవరం-మహేంద్ర రోడ్డులో పాత గ్యాస్ కంపెనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు విచారణ చేయగా అన్నపూర్ణ అమ్మవారి ఆలయంలో మంగళసూత్రాలతోపాటు ఈనెల 1న బిక్కవోలు మండ లం పందలపాక గ్రామంలో కాలువగట్టున ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వెండి కిరీటం, వెండి చెవులు అపహరించినట్లు సాయివరప్రసాద్ నేరాన్ని అంగీకరించారు. చోరీకి పాల్పడిన సాయి వరప్రసాద్ నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు, సుమారు 1250 గ్రాముల వెండి కిరీటం, వెండి చెవులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సాయి వరప్రసాద్‌పై రాయవరం పోలీస్‌స్టేషన్‌లో గతంలో సోమేశ్వరం బాపనమ్మ అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు. చోరీలకు పాల్పడిన సాయివరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలను దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలి

- ప్రవేశ పరీక్షలపై 'తిరుమల'లో జరిగిన అవగాహన సదస్సులో తిరుమలరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రులు సుమారు 18 వేల మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను మానసికంగా కాకుం డా, శారీరకంగా, దృడంగా ఉండేలా సన్నద్ధం చేయాలని అప్పుడే వారి పిల్లలు వృద్ధిలోకి వస్తారన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్‌లలో తరచూ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కువగా అలవాటు పడ్డారని వారి పుస్తకాలతో కన్నా మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టంపై తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులు అని, వారిని చూసి పిల్లలు నేర్చుకుంటారని పిల్లల నడవడికను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు వారికి నేర్పాలన్నారు. విజ్ఞాన భారతి నేషనల్ సెక్రటరీ సుబ్బరాయశర్మ మాట్లాడుతూ పిల్లల్లో ఆలోచనా విధానం, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే పుస్తకాలు ఎక్కువచదవాలన్నారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్లు సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదనపు ఆర్థిక సాయం పొందిన
ఇళ్ల నిర్మాణం నూరు శాతం పూర్తికావాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు మే నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణం నూరుశాతం పూర్తి చేసేలా అధికారులు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం మండలం, డివిజన్, నియోజవర్గాల అధికారులు, ప్రత్యేక అధికారులతో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీఎస్ భాస్కర్‌రెడ్డితో కలిసి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మే 31 నాటికి జిల్లాలో 10,794 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించేలా జిల్లాకు లక్ష్యాన్ని నిర్ధేశించినట్టు తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 4,929 ఇళ్లు (46శాతం) లక్ష్యాలను సాధించినట్టు పేర్కొన్నారు. ఇంకా 5,865 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరికం లేని సమాజ స్థాపన ధ్యేయంగా చర్యలు తీసుకుంటోందని, సొంత ఇంటి నిర్మాణం ద్వారా 50శాతం పేదరికం జయించినట్లేనని అన్నారు. మార్చి 31వరకు ఇచ్చిన గడువు ముగిసిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ముందుకు రావడంతో ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అదనపు ఆర్థిక సాయం విడుదల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని తెలిపారు. అదనపు ఆర్థిక సాయం కోసం ఆప్షన్ విషయమై మరోసారి క్షేత్రస్థాయిలో ఆ మేరకు గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మరోసారి ఇంటి నిర్మాణం కోసం ఆసక్తి ఉన్న లబ్ధిదారుల స్టేజ్ కన్వర్షన్ విధానంలో త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, హౌసింగ్ ఐటీ పర్సన్ టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

రూ.1.25 కోట్లతో పంప్‌హౌస్ పైప్‌లైన్ పనులు

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిలింగాలపేటలో దశాబ్దాల నాటి ముంపు సమస్యకు పేపరుమిల్లు సహకారంతో శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పేపరు మిల్లు సీఎస్ఆర్ ఫండ్స్ రూ1.25 కోట్లతో స్థానిక 41వ డివిజన్ కోటిలింగాలపేటలో నిరిస్తున్న పంప్‌హౌస్ పైప్‌లైన్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో ఈ పను లు మే 30నాటికి పూర్తవుతాయని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా కోటిలింగాల పేట ప్రజలు వర్షాకాలంలో ముంపుబారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో వర్షం ముంపు సమయంలో ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోతే ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు పత్తాలేకుండా పోయేవారని ఆ సమయంలో తాను మోకాల్లోతు నీటిలో ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు, తాగునీరు అందించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, పేపరుమిల్లు ఈడీ ముఖేష్ జైన్, కొయ్యల రమణ, ఆడారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

అనపర్తి కోర్టు జడ్జి వంశీకృష్ణ

బిక్కవోలు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చట్టాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి ఎం.వంశీకృష్ణ సూచించారు. బలభద్రపురం పంచాయతీలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన విచ్చేసి ప్రసంగించారు. పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మహిళలకు వున్న ప్రత్యేక చట్టాలను తెలుసుకోవాలన్నారు. బలభద్రపురానికి డోకుబుర్ర రాజు అనే సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు చేస్తున్నామని, ఈయన వారానికి ఒక రోజు పంచాయతీలో అందుబాటులో వుంటారని వీరి ద్వారా ఉచిత న్యాయ సలహాలు తీసుకోవచ్చునని చెప్పారు. అనంతరం జడ్జి వంశీకృష్ణను సర్పంచ్ బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో లాయర్లు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

7 నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం.. రంగంపేట కాలేజీ అధ్యాపకులు

రంగంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాయిన్ అవ్వాలని కోరుతూ కళాశాల అధ్యాపకులు గురువారం మండలంలోని వివిధ ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని రంగంపేట, వడిశలేరు, చంద్రేడు,దొడ్డిగుంట, సింగంపల్లి, ఈలకొలను, పల్లకడియం, జి.దొంతమూరు హైస్కూళ్లను సందర్శించి విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నా యని తెలిపారు. ఈ నెల 7 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

జీజీయూ చాన్సలర్ చైతన్యరాజు



జీజీయూ డిజిటల్ మార్కెటింగ్ స్టార్టప్‌ను ప్రారంభిస్తున్న చాన్సలర్

రాజానగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు అన్నారు. వర్శిటీలోని ఎంబీఏ విభాగం మొదటి ఏడాది విద్యార్థులు రూపొందించిన డిజిటల్ మార్కెటింగ్ స్టార్టప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా పరమైన నైపుణ్యం ఉన్నత మైన అభివృద్ధి సామాజికంగా దోహదపడే ప్రయత్నాలను ప్రోత్స హించే విలువలను రూపొందిం చడంపై జీజీయూ నిబద్ధత కలిగి ఉందన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందజేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, ఎంబీఏ విభాగాధిపతి బీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోకవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకవరం, కొత్తపల్లి, తంటికొండ గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 4న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. దీంతో గోకవరం, కృష్ణునిపాలెం, రామన్నపాలెం, చిన్నూరు, కొత్తూరు, రామానుజపురం, వెంకటాపురం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలింకపల్లి, కొత్తపల్లి, రాజుపాలెం, గంగంపాలెం, ఠాకూరుపాలెం, కామరాజుపేట, జగన్నాథపురం, సూదికొండ, శివరామపట్నం, భూపతిపాలెం, మల్లవరం, తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయిలపల్లి,గోపాలపురం, గరగలపాలెం, అచ్చియ్యపాలెం, ఇందుకూరుపేట, దేవారం, రావిలంక, పొత్తుకొండ, శరభవరం, ఉప్పయ్యపాలెం, నేలకోట గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సీతానగరం: మండలంలోని మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్ తెలిపారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు, వ్యసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

డ్రైనేజీ, కల్వర్ట్‌ల నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుకుంపేట జంక్షన్ నుంచి తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళ్లే రహదారిలో నిర్మాణంలో వున్న డ్రైనేజీ, కల్వర్ట్‌ల పనులను టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ స్థానిక పార్టీ నాయకులు, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ నిధులు లేవంటూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే కల్వర్టుల నిర్మాణాలు చేపట్టకుండా కాలయాపన చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక నూతన కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే గోరంట్ల హామీ ఇచ్చారని, ఆ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.37 కోట్లతో కల్వర్టులు, డ్రయిన్ల నిర్మాణం చేపట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, హుకుంపేట కార్యదర్శి కాశీవిశ్వనాథ్, దుద్దుపూడి రమేష్, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, బొప్పన నానాజీ, కంటిపూడి చౌదరి, బొప్పన శ్రీను, వెలమాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

శృంగేరీ మహాస్వామి జన్మదిన వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శృంగేరీ శారదా పీఠాధిపతులు, జగద్గురు శంకరాచార్య శ్రీ భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకలు రాజమండ్రిలో ఘనంగా జరిగాయి. శృంగేరీ శంకరమఠంలో గురువారం జగద్గురువుల పాదుకలకు విశేష అర్చన, పంచామృతాభిషేకం, వేద స్వస్తి జరిపారు. ఈ సందర్భంగా మహాచండీ సప్తసతి పారాయణం, ఆయుష్ హోమం, మహా చండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. బొమ్మూరు మహారోగి ఆరోగ్య కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

కళారత్న పురస్కార గ్రహీతకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కళారత్న పురస్కారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కమాండెంట్ కొండా నరసింహరావు అలివేలు మంగాదేవి దంపతులను ఏపీఎస్‌పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. గురువారం రాజమహేంద్రవరంలో నరసింహరావు దంపతులను సత్కరించారు.

ఆర్ట్ ఫెస్టివల్‌కు పూర్తి సహకారం

- 120 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు
- వివిధ కళల్లో 57 మంది కళాకారుల ప్రదర్శనలు
- నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్ర కళావీధి-ఆంధ్రాస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి 120 మంది వలంటీర్లు సహకారం అందిస్తారన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో 57 మంది కళాకారులు హాజరై వివిధ కళలను ప్రదర్శిస్తారని చెప్పారు. మన కళలు సంస్కృతిని తెలియజేసే కార్యక్రమాల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రియేటివిటీ, కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా పెద్దఎత్తున నిర్వహిస్తున్న కార్యక్రమం అమరావతి చిత్రకళావీధి -ఆంధ్రాస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్ కార్యక్రమమని అన్నారు. లైవ్ ఆర్ట్ క్రియేషన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్, ఇన్స్టాలేషన్, హస్తకళా ప్రదర్శనలు, ఆర్టిస్ట్ టాక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్టిస్ట్ అండ్ రికగ్నిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందరూ హాజరై కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.ఆనంద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, పీవోలు ఎం.గోపాలకృష్ణ, ఏఎం శిరీషా, ఎల్.సుజాత, ఎస్.రాజ్యలక్ష్మి, ఎల్.ముత్యాలనాయుడు, అప్పలరాజు, కె.రాజరాజేశ్వరిదేవి పాల్గొన్నారు. నన్నయ వర్శిటీ అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, బీఈడీ, న్యాయవిద్య పరీక్షలు జరుగుతున్న సందర్భంగా కాకినాడలోని వీఎస్ఎల్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను వీసీ ఎస్.పప్రసన్నశ్రీ తనిఖీ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రైతుల ఆర్థిక పరిపుష్టే ఏరువాక లక్ష్యం

వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు శివన్నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న శివన్నారాయణ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడం ద్వారా రైతులకు ఆర్థిక పరిపుష్టి కలగజేసే లక్ష్యంతో ఏరువాక కేంద్రాలు పనిచేస్తున్నాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు జి.శివన్నారాయణ అన్నారు. దివాన్‌చెరువులో ఏరువాక కేంద్రం గురువారం జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించింది. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చల్లా వెంకట నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్టేరు పరిశోధన స్థానం అధిపతి టి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి శివన్నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరిశోధనా ఫలితాలను ప్రయోగశాల నుంచి రైతు కమతాల్లోకి తీసుకెళ్లేందుకు ఏరువాక కేంద్రాలు కృషి చేస్తున్నాయన్నారు. రైతులకు, వీఏఏలకు వచ్చే సంవత్సరం సార్వా, దాళ్వా పంటలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై సీజన్‌కు ముందుగా రైతుసేవా కేంద్రాల వేదికగా శాస్త్రవేత్తలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. 2024-25 సంవత్సరంలో ఏరువాక కేంద్రం నిర్వహించిన పలు కార్యక్రమాలను నరసింహారావు వివరించారు. వచ్చే ఏడాది చేపట్టే ప్రయోగాలపై చర్చించారు. టి.శ్రీనివాస్ మార్టేరులో అభివృద్ధి చేసిన నూతన వరి రకాలను తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఏరువాక కేంద్రంతో వ్యవసాయశాఖ సమన్వయాన్ని వివరించారు. సమావేశంలో నాబార్డ్ ఏజీఎం వైఎస్ నాయుడు, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు

ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల



ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. నియోజకవర్గంలో మిగిలున్న ప్యాచ్ వర్క్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీతానగరం క్రీడా వికాస కేంద్రం పనులు తక్షణమే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రఘుదేవపురం-మల్లంపూడి రోడ్డు పనులు ఈ నెల 15నుంచి ప్రారంభించాలని ఎమ్మెల్యే సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో 326 కిలో మీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారులున్నా యని, వీటిలో ఎండీఆర్ కింద 30 రోడ్లు, స్టేట్ హైవేస్ కింద ఆరు రోడ్లు ఉన్నాయని, ఈ రోడ్ల అన్నింటి పటిష్టతకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అలాగే సీతానగరం రోడ్డు సత్వరమే ప్రారంభించాలని, రాపాక రోడ్డు మెట్ట గంగాలమ్మ ఆలయం వరకు పూర్తిగా ఛిద్రమైందని, మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. కోటికేశవ రం-నాగంపల్లి మూడు కిలోమీటర్లు మేర రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. రాజానగరం-గాదరాడ రోడ్డు పది కిలోమీటర్లు, నాగంపల్లి-చిన కొండేపూడి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే రాజానగరం-పెడపర్తి రోడ్డు, నామవరం-యర్రంపాలెం, కొండగుంటూరు-సంపత్‌నగరం రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. శ్రీకృష్ణపట్నం-కానవరం, రాధేయపాలెం రోడ్డు త్వరగా అభివృద్ధి చేయాలన్నారు. నరేంద్ర పురం-కొత్త వెలుగుబంద, చక్రద్వారబంధం రోడ్డు మేర ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే బత్తుల ఆదేశించారు.

కాలువల్లో పూడికతీత చేపట్టాలి

నియోజకవర్గంలో వివిధ సాగునీటి పథకాలు, ప్రాజెక్టుల కింద ఓఅండ్ఎం పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలు, ప్రధాన, పిల్ల కాలువల్లో పూడికతీత పనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా చాగల్నాడు ఎత్తిపోతల పథకం, తొర్రిగడ్డ, పాతవెంకటనగరం, కొత్త వెంకటనగరం, పుష్కర పథకాల కోసం సిద్ధం చేసిన ప్రతిపాదనలను అధికారులు ఎమ్మెల్యేకు నివేదించారు. ఆయా సమీక్షా సమావేశాల్లో అర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలై దోపిడీలు

అర్ధరాత్రి దోపిడీకి యత్నించిన ముగ్గురు యువకుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుమంత్

అనపర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలై దోపిడీల బాట పట్టిన ముగ్గురు యువకులను అనపర్తి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి అనపర్తిలోని బాబూ జగ్జీవన్‌రామ్ నగర్‌లో ఇంటిపై దోపిడీకి పాల్పడి పరారైన ముగ్గురు యువకులను గురువారం పోలీసులు అరెస్టు చేసినట్టు గురువారం రాత్రి సీఐ సుమంత్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి బాబూ జగ్జీవన్‌రామ్ నగర్‌కు చెందిన డ్రైవర్ అకుల సురేష్ ట్రైను ఎక్కేందుకు నడిచి వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన పిల్లి కార్తీక్, అయినవిల్లి అంజి, అయినవిల్లి వినయ్‌కుమార్ దారిలో అడ్డగించి దాడికి పాల్పడ్డారు. అతడి సెల్‌ఫోన్ లాక్కుని డబ్బులు తీయమని బెదిరించడంతో అక్కడి నుంచి పరుగులు తీసి ఇంటికి చేరుకున్నాడు. ఇంతలో ఇంటికి చేరుకున్న ముగ్గురు యువకులు ఇంటిలోకి చొరబడి సురేష్‌ను అతని భార్యను కత్తితో బెదిరించి వారి వద్ద నున్న రూ.1500 తీసుకున్నారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు కూడా ఇవ్వాలని బెదిరించారు. ఇంతలో వారు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గురువారం ఉదయం సురేష్ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గతంలో అదే ప్రాంతంలో ఒంటరిగా నివాసం ఉంటున్న బచ్చు సత్యవతి అనే వృద్ధురాలిని పిల్లి కార్తీక్ బెదిరించి గాజులు దొంగతనం చేశాడు. అలాగే 2023లో గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ సమావేశంలో ఎస్ఐలు శ్రీను నాయక్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయ వార్షికోత్సవం

కడియం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కడియం మండలం మాధవరాయుడుపాలెం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర శివపంచాయతన క్షేత్రాన్ని గురువారం ఆంధ్రా పేపరుమిల్లు ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్‌జైన్ సందర్శించారు. ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి సర్పంచ్ అన్నందేవుల చంటి ఆహ్వానం మేరకు ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థయైన ఓంశాంతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముఖేష్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కాగా శివాలయం వార్షికోత్సవం సందర్భంగా చంటి-విజయ దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కళాశాల శిక్షణార్థులకు డీటీవో సురేష్ సూచనలు



ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణా కళాశాలలో 13వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించిన డీటీవో సురేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందుతున్నవారు డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకోవడంతోపాటు రోడ్డు భద్రతా నియమాలను తు.చ తప్పకుండా పాటించాలని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణా కళాశాలలో హెవీవాహనాల డ్రైవింగ్ శిక్షణ కోసం 19 మందితో 13వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి సురేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణా కళాశాలలో ఇప్పటి వరకూ 192 మంది శిక్షణ పొందారని, వారంతా పేరొందిన వివిధ రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్కే షబ్బం, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, ఏఎంపీ రాజు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వీఎస్ఎల్ రావు పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్ జిల్లాలో
అందరికీ ఒక షెల్టర్

ఆర్యవైశ్య సంఘ సమావేశంలో శ్రీఘాకోళపు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని వైశ్యా హాస్టల్ జిల్లాలో ఆర్య వైశ్యులందలందరికీ ఒక షెల్టర్ అని ఆర్యవైశ్య నేత శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రాత్రి రాజమహేంద్రవరంలోని వైశ్యా హాస్టల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశాకి ఆయన విచ్చేసి మాట్లాడారు. హాస్టల్ కమిటీని పూర్తిగా అందరు ఏకగ్రీవ నిర్మాణం చేసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘానికి అందిస్తున్నామన్నారు. జిల్లా సంఘం అధ్య క్షుడు ప్రగళ్ళపాటి కనకరాజు, నంబూరి రెడ్డియ్య, పల్లపోతు బంగారం, కోర్రుప్రోలు వెంకటేశ్వరరావు, అత్తులూరి సాయిబాబా, కుసుమంచి సుబ్బరాములు మాట్లాడారు. సమావేశంలో వైశ్య హాస్టల్ అధ్యక్షుడు కోట్ల కనకేష్, కోశాధికారి మండవల్లి శివ, ఆర్యవైశ్య నాయకులు తొంటేపు స్వామి, చాంబర్ అధ్యక్షుడు తవ్వరాజా ఆర్య వైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో చలివేంద్రం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు కానుమిల్లి వెంకన్నదొర తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక విమలమ్మ హాస్పిటల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన కుమార్తె డాక్టర్ అచ్యుత కృష్ణ గురువారం ప్రారంభించారు.15 ఏళ్లుగా ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీరుస్తున్నామన్నారు.

బిక్కవోలుకు నోడల్
అధికారుల నియామకం

బిక్కవోలు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నోడల్ అధికార్లను నియమించినట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆర్ఎస్.పేట, బిక్కవోలుకు ఎంపీడీవో వి.శ్రీనివాస్, బలభద్రపురానికి తహశిల్దార్ సత్యకృష్ణ, రంగాపురానికి ఏవో ఎన్.సామ్యూల్‌జాన్, ఆరికరేవులకు హౌసింగ్ ఏఈ వనమయ్య, తొస్సిపూడికి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.సాయికుమార్, కొంకుదురుకు ఈవోపీఆర్‌డీ జాన్‌మిల్టన్, కొమరిపాలేనికి ఇన్‌చార్జి మండల ఇంజనీర్ పీవీ రామిరెడ్డి, మెళ్లూరుకు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జి.అగస్టీన్‌కుమార్, పందలపాకకు ఎంఈవో-1 సీహెచ్‌వీవీ. సత్యనారాయణ, ఊలపల్లికి ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు, ఇల్లపల్లికి వీపీఎస్ డీవీ ప్రణీత్, కాపవరానికి ఏఎస్‌వో ఎస్.ప్రభుకృష్ణను నియమించినట్టు ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

నాలుగైదు రోజుల్లో ధాన్యం
కొనుగోళ్ల ప్రారంభం

సీతానగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఏవో సూర్యరమేష్ తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ పంట దెబ్బతినడంతో రైతులు దాళ్వాపంట ముందుగా వేయడం వల్ల పంటలు ముందుగానే కోతకు వచ్చాయన్నారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కాలేదని పంట ముందుగా రావడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రైతులెవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని అన్నారు. కాగా ప్రభుత్వం ధాన్యం కొనకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే పంట కోతకు వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మే 21 నుంచి
జాతీయ నాటిక పోటీలు

అనపర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 29వ జాతీయ స్థాయి ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు మే 21నుంచి 24వరకు నిర్వహించనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళామందిరంలో ఈ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు తొమ్మిది నాటక సమాజాల ప్రదర్శనలు నాటక ప్రియులను అలరించనున్నాయని పేర్కొన్నారు.

'నాగాంజలి' సంఘటనను
రాజకీయం చేయొద్దు

పెరిక కుల సంఘ అధ్యక్షుడు బద్రి, జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఫార్మడీ ఫైనలియర్ చదువుతూ బొల్లినేని కిమ్స్‌లో ఇంటర్‌షిప్ చేస్తున్న ఎస్.నాగాంజలి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో కొన ఊపిరితో ఉందని ఈ సంఘటనను రాజకీయం చేయొద్దని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పెరిక కుల సంఘ అధ్యక్షుడు వానపర్తి బద్రి అన్నారు. గురువారం కిమ్స్ ఆసుపత్రి వద్ద బద్రి జనసేన రాజమండ్రి ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీ విద్యార్థిని నాగాంజలి కేసు పోలీసుల దర్యాప్తులో ఉందన్నారు. దీనిని రాజకీయం చేయకుండా చేతనైతే సాయం చేయాలన్నారు. ఆడ బిడ్డను చదివించుకోవడానికి బయటకు పంపితే భద్రత లేని సభ్యసమాజం ఉందన్నారు, 11 రోజులుగా ఆసుపత్రివద్ద ఉంటూ ఇక్కడ పరిస్థితిని పరిశీలిస్తున్నామన్నారు.

వాడపల్లి బెల్లపు బట్టీలలో విజిలెన్స్ తనిఖీలు 8



నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతి, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500 మందికిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

8



రూ.171.33 కోట్లతో సత్యదేవుడి ఆలయ బడ్జెట్

అన్నవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.171.33 కోట్లతో ఆలయ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ బడ్జెట్‌లో వీటిలో మూడో వంతుగా రూ.46.25కోట్లు రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల చెల్లింపులకు కేటాయించారు. రెమ్యునరేషన్ పద్ధతిపై పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు, వ్రత పురోహితులు, ప్రసాదం ప్యాకర్లకు రూ.19.70 కోట్లు చెల్లింపునకు ఆమోదం లభించింది. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ తదితర ఉత్సవాల నిర్వహణకు ఈ ఏడాదిలో రూ.1.57 కోట్ల వరకు ఖర్చు చేసుకునే వీలుకల్పించారు. పారిశుధ్యం నిర్వహణ, హౌస్‌కీపింగ్, చలువ పందిళ్ల ఏర్పాటు తదితర వాటికి రూ.7.64 కోట్లు, రూ.1.63 కోట్లు విద్యుత్‌బిల్లుల చెల్లింపు, నిర్వహణ, ఎలక్ట్రికల్ గూడ్స్ కొనుగోలు, నీటి సరఫరాకు రూ.1.63 కోట్లు కేటాయింపులు జరిగాయి. ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు రూ.1.16 కోట్లు, రూ.5.03కోట్లతో దత్తత ఆలయాలు, విద్యాసంస్థల నిర్వహణ, వేదపాఠశాల, వైద్యసదుపాయాలకు వెచ్చించాలి. రూ.5.35 కోట్లు ఆలయ భద్రతకు, రూ.23.30 కోట్లను సీజీఎఫ్, ఆడిట్‌ఫీజు, పన్నులకు, అన్నదాన విభాగానికి 6.43 కోట్లు కేటాయించారు.

టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితా

9 వరకూ అభ్యంతరాలు స్వీకరణ

డీఎస్ఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాపై ఈ నెల 9వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని డీఈవో కంది వాసుదేవ రావు తెలిపారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యా శాఖ పరిధి లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించి గత నెల 10న, 25న రెండుసార్లు అభ్యంతరాలు స్వీకరించి సరి చేయడం జరిగిందన్నారు. ఎస్‌జీటీలు సమాన క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కోసం సబ్జెక్టు వారీగా, స్కూల్ అసిస్టెంట్ సమాన క్యాడర్ నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతికి తాత్కాలిక సీనియారిటీ జాబితాలను రూపొందించామని చెప్పారు. ఆ జాబితాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ www.deoeluru.org వెబ్‌సైటులో, నోటీసు బోర్డులో ఈ నెల 3 నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు.వాటిలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ లోగా తగు ఆధారాలతో ఏలూరు జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఎస్ఈవో పేర్కొన్నారు.

రేపు, ఎల్లుండి రాష్ట్రస్థాయి

కుస్తీ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కుస్తీపోటీలు ఈనెల 5, 6 తేదీల్లో దివాన్‌చెరువులో జరుగుతాయని రోటరీక్లబ్ రాజమండ్రి చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా, ఐకాన్ అధ్యక్షుడు వెంకట్, స్పోర్ట్స్ ఛైర్మన్ శంకర్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అండర్ - 15 బాలురు, బాలికలు, అండర్ - 20 పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు సుమారు 300 మంది రెజ్లర్లు హాజరవుతారని తెలిపారు.విజేతలు రాజస్థాన్‌లోని కోటాలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీలకు అర్హత సాధిస్తారని అన్నారు.



ఇలాగే రాయించండి : ముక్కొల్లు చెక్‌డామ్ వద్ద హెచ్చరిక బోర్డులు రాయిస్తున్న పోలీసులు



చూస్తుండగానే వెళ్లిపోతార్రు,జాగ్రత్త : తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గురువారం స్నానాలు చేస్తున్న సందర్శకులు

ఆదమరిస్తే.. అంతే!

టెన్త్.. ఇంటర్.. పరీక్షలు ముగిశాయి.. విద్యార్థులకు దాదాపుగా వేసవి సెలవులు వచ్చేశాయి.. చిన్న తరగతులకు చూస్తే ఒంటిపూట బడులు నడుస్తున్నాయి.. దీంతో ఆనందానికి హద్దే లేకుండాపోతోంది.. ప్రతిరోజూ ఈరోజు ఏంటీ అనే ఆలోచనే.. దీంతో చాలా మంది పిల్లలు.. యువత సరదాగా గడుపుదామని నదీ స్నానాల బాటపడుతున్నారు. అయితే ఆదమరుపుగా ఉన్నారో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.. నది ఎంత ప్రశాంతంగా కనిపిస్తుందో ప్రమాదం జరిగిన తరువాత అంతే విషాదాన్ని మిగులుస్తోంది. అందుకే తస్మాత్ జాగ్రత్త.. నదిలో స్నానాలకు దిగినా రక్షణ చర్యలు తీసుకోవాల్సిందే. ఆదమరుపుగా ఉన్నామా మునిగిపోతామంతే..



ప్రాణాల మీదకు తెచ్చుకో వద్దు : పెద్దనాపల్లిలో మృతదేహాన్ని పట్టుకుని కుటుంబీకుల రోదన

పేరులోనే గోదావరి ఉన్న జిల్లా మనది.. నీటికి లోటు లేదు.. ఆ నీటిలో జరిగే ప్రమాదాలకు కొదువే లేదు. ప్రతి ఏటా 50 మంది వరకూ నదీ ప్రమాదాల్లో మృత్యుపడుతున్నారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నది ఏదైనా పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది.. దిగితేనే దాని లోతు తెలుస్తుంది.. ప్రస్తుత వేసవి నేపథ్యంలో నదీ స్నానాలకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.. గోదావరి.. కాలువలు. సముద్రతీర ప్రాంతం ఇలా ఎక్కడపడితే అక్కడ సరదాగా స్నానాలకు క్యూకడుతుంటారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి రోజు వేలాది మంది స్నానాలు ఆచరిస్తుంటారు. ఈ సరదాలో ప్రమాదాలను గుర్తించలేక పలువురు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. ఇటీవల శివరాత్రికి తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరిలో స్నానం చేద్దామని వెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. బుధవారమే చూస్తే కాకినాడ జిల్లాలో కాండ్రకోట, పెద్దనాపల్లి వద్ద ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. వేసవి సెలవుల్లో సరదాకు స్నానాలు సరే కానీ ఆదమరుపుగా ఉన్నామా మిగిలేది మాత్రం కన్నీళ్లే..

ఈత సరదా..పొంచి ఉన్న ముప్పు

- ప్రమాదకరంగా గోదారి ఘాట్లు
- కాలువలదీ ఇదే పరిస్థితి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- వేసవి తాపంతో పెరిగిన తాకిడి
- బుధవారమే నలుగురు మృతి
- అయినా పట్టని అధికారులు
- ఇకనైనా మేల్కొనాల్సిందే



సరదాలు వద్దు నాయనా : అల్లవరం వద్ద సముద్రతీరంలో చిన్నారుల ఈత సరదా

రక్షణ చర్యలు చేపట్టండి

నదీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. నది లోతు.. జరిగే ప్రమాదం.. తదితర విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలి. కాలువ రేవులు, ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా ఉండే గోదావరి ఘాట్ల వద్ద సచివాలయ పోలీసులు నియమించాలి. కాటన్ బ్యారేజీ కిందకు వెళ్లే దారులన్నీ మూసివేయాలి. ప్రధాన కాలువల్లో జరిగిన ప్రమాదాలతో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. గోదావరి ఘాట్ల వద్ద కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అప్రమత్తంగా ఉంటారు.

ఈత సరదా.. కాదు!

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు/ఆత్రేయపురం: ఉమ్మడి జిల్లాలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం చాలా ఎక్కువ. ఇటు తూర్పుగోదావరి.. అటు కోనసీమ జిల్లా లను ఆనుకుని గోదావరి ప్రవహిస్తుంది. వేసవి వచ్చిందంటే పిల్లలతోపాటు పెద్దలు గోదావరి స్నానాలకు క్యూకడుతుంటారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ఉంటుంది. ఈ నేపథ్యంలో లోతు ఎక్కువ. కొవ్వూరు గోష్పాదక్షేత్రం.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, అయ్యప్ప ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజీ, జొన్నాడ తదితర ప్రాంతాల్లో స్నానాలు ఎక్కువగా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో ప్రతి ఏటా పర్యాటకులు వేలాదిగా స్నానాలు చేస్తుంటారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో యువకులు మృత్యువాతపడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలిస్తున్నారు. గతేడాది మే నెలలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఎందరో చనిపోయారు. ఊబలున్న చోట పైకి గోదావరి చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది దిగితేనే దాని లోతు తెలిసేది. పుష్కరాల రేవులో చాలామంది పిల్లలు, పెద్దలు లోతు తెలియక దిగి మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. పడవలపై గోదావరి మధ్యలోకి వెళ్లి లంకల్లో దిగి స్నానాలు చేస్తున్నవారున్నారు. అయినా నేటికీ రక్షణ చర్యలు కానరావడం లేదు. రోజురోజుకు సందర్శకులు పెరుగుతున్నా ఏ ఒక్కరూ రక్షణపై దృష్టి సారించడంలేదు.



వేసవి ఉపశమనం..గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరిలో స్నానాలు

కన్నీట.. కాలువలు

పిఠాపురం/ ప్రత్తిపాడు/కిర్లంపూడి/ పెద్దాపురం : కాలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి.. లోతు తెలియకుండా దిగి ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల ఏలేరు,*ఎబీసీ కాలువలు ఉన్నాయి. వర్షాకాలంలో సుద్దగడ్డ కాలువ ప్రమాదకరంగా ఉంది. ఏలేరు కాలువలో పిడిందొడ్డి, ఎదురొడ్డి, గొల్లప్రోలు కాలువలతోపాటు బల్లకట్టు, భోగాపురం గుమ్మిడిగట్టు రెగ్యులేటర్, గొల్లప్రోలు, చిత్రాడ, నవఖండ్రవాడ, మల్లవరం, యండపల్లి తదితర ప్రాంతాల్లోని పీబీసీ కాలువలు, గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువ, చెందుర్తి, కొడవలి వద్ద పుష్కర, పోలవరం కాలువల వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకుని గత ఐదేళ్లలో 19 మంది మృత్యువాతపడ్డారు. ఏలేశ్వరం ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాదభరితంగా మారింది. పెదశంకర్లపూడి, రౌతుపాలెం,పెద్దిపాలెం, గజ్జనపూడి, యుజేపురం తదితర చోట్ల స్నానాలకు కాలువలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.పోదురుపాక, గజ్జనపూడి, చింతలూరు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. కిర్లంపూడి మండలం ముక్కొల్లు,పెద్దాపురం మండలం కాండ్రకోట ఏలేరు బెడ్ రెగ్యులేటర్ల వద్ద ప్రమాదకరంగా ఉంది. రెండు చోట్లా ఇప్పటివరకూ 30 మంది మృత్యువాతపడడమే అందుకు ఉదాహరణ.

ప్రమాదాల తీరం..

అల్లవరం : సముద్ర తీరం చూస్తే ఎవరికి స్నానం చేయాలనిపించదు మరి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అల్లవరం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో సముద్రతీర ప్రాంతాలు ఉన్నాయి. వేసవి కావడంతో కొందరు యువకులు సముద్ర స్నానాలకు దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అల్లవరం, కాకినాడ సముద్ర తీర ప్రాంతాల్లో పలు ప్రాంతాల నుంచి కుటుంబీకులతో బీచ్‌కు చేరి సముద్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఓడలరేవు తీరంలో మెరైన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నా కొందరు యువత వారిని కాదని లోతుకు వెళ్లి మృత్యువాతపడుతున్నారు. తీరాన అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతి.



కురుకూరులో భూ రీసర్వేపై అధికారులకు సూచనలు చేసి..రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి..

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయండి

రెండో దశ రీ సర్వే పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

దేవరపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూముల సమగ్ర కొలతల నిర్ధారణకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని ఎటువంటి సమస్యలు లేకుండా రీసర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. దేవరపల్లి మండలం కురుకూరు పొలాల్లో గురువారం సాయంత్రం రెండో దశ రీసర్వే పనులు పరిశీలించారు. రైతులు, అధికారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు అనంతరం రైతు సేవాభవనంలో రైతులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వేకు సంబంధించి పలు ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా రెండో దశ రీసర్వే చేయడం జరుగుతుందన్నారు. గతంలో చేపట్టిన రీసర్వేపై కొలతల్లో వ్యత్యాసాలు, ఇతర అభ్యంతరాల నేపథ్యంలో సీసీఎల్ కమిషనర్ ఆదేశాలను అనుసరించి క్షేత్రస్థాయిలో రెండో దశ రీసర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రికార్డులను సక్రమంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కురుకూరులో 1050 మంది రైతులకు చెందిన 25 వేల ఎకరాల భూమిలో 80 శాతం తప్పులతడకలుగా రీసర్వే జరిగిందని రైతులు యలమాటి భాస్కరరావు, కొయ్యలమూడి అచ్యుతరాయుడు, కలగర శ్రీనివాస్, కొయ్యలమూడి శ్రీనివాస్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తప్పుల తడకలుగా ఎందుకు నమోదయ్యాయని వీఆర్వోను ప్రశ్నించారు. ఆ తప్పులు మరలా జరగకుండా రీసర్వే చేయాలన్నారు. ప్రస్తుతం రెండు టీమ్‌లు రీసర్వే చేస్తున్నాయని రైతుల కోరిక మేరకు మూడో టీమ్ కూడా ఏర్పాటు చేసి రీసర్వే త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.చినరాముడు, ఆర్‌డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఐటీఎస్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ ఢిల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, రైతులు బేతిన వెంకట్రావు,మల్లెల వెంకటేశ్వరరావు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో ‘తూర్పు’ భేష్

- పండ్ల తోటల పెంపకంలో ప్రథమం
- పల్లె పండుగలో రెండో స్థానం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో రాష్ట్రంలోనే మెరుగైన స్థానాల్లో తూర్పుగోదావరి నిలిచిందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా ప్రగతి నివేదికను ఆమె గురువారం విడుదల చేశారు. 11,754 కుటుంబాలకు 100 రోజుల పనిదినాలను కల్పించడం జరిగిందని.. దీంతో లేబర్ బడ్జెట్‌లో 102.07 శాతంతో రాష్ట్రంలో తూర్పుగోదావరి ఆరో స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 1 లక్షా 247 కుటుంబాల్లో 1,32,954 మంది ఉపాధి కూలీలకు 51,88,790 పనిదినాలు కల్పించడం ద్వారా రూ.131కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. ఎస్సీ కుటుంబాలకు 18.67 లక్షలు, ఎస్టీ కుటుంబాలకు 1.02 లక్షల పనిదినాలు కల్పించామన్నారు.రూ.225 రోజువారీ వేతనం చెల్లించామన్నారు. 2025-26 ఏడాదిలో సగటున దినసరి వేతనం రూ.300 వరకూ పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. పల్లె పండుగలో జిల్లాలో 149.50 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లను రూ.72 కోట్లతో నిర్మించి రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో, పాడి రైతులకు సంబంధించి 583 పశువుల షెడ్లను రూ.9.85 కోట్లతో నిర్మించి రాష్ట్రంలో ఏడో స్థానంలో, 373 మంది సన్న, చిన్నకారు రైతులకు రూ.643.50 ఎకరాల్లో రూ.87.90 లక్షల వ్యయంతో పండ్ల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడం ద్వారా ప్రథమ స్థానంలో నిలిచామన్నారు.112 సాగునీటి చెరువుల(ఫారం పాండ్లు)ను రూ.55లక్షలతో పూర్తి చేశామన్నారు.

పంచ ప్రాధాన్యతలు

2025-26లో పంచ ప్రాధాన్యతలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొన్నామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపాధి హామీ కూలీలకు 35 లక్షల పని దినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సగటున ప్రతి పనిదినానికి రూ.300 వేతనం అందే విధంగా మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఉపాధి నిధులతో వేసవిలో పశువులకు నీటి సదుపాయ కల్పనకు 157 ప్రదేశాల్లో రూ.33 వేలతో పశువుల నీటి తొట్టిలను ఏప్రిల్ 10లోగా పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. 3 నెలల్లో 1,500 ఫారం పాండ్లను 9 మండలాల్లో నిర్మిస్తామన్నారు. డెల్టా మండలాలకు సంబంధించిన పంట కాలువలు, మైనర్, మేజర్ కాలువల్లో పూడిక తీయడానికి 2500కిలో మీటర్లను లక్ష్యంగా నిర్ణయించామన్నారు. 392 చెరువుల్లో పూడిక తీతకు పరిపాలన ఆమోదం ఇచ్చామన్నారు. జిల్లాలో రూ.15 లక్షల చొప్పున నిధులతో స్మశాన వాటికలను అభివృద్ధి చేయడం కూడా ప్రాధాన్యంగా తీసుకున్నామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు.



కాకినాడలో తనిఖీ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

పరీక్షలు జాగ్రత్తగా రాయండి

నన్నయ వర్శిటీ పరిధిలో డిగ్రీ,లా, బీఈడీ పరీక్షలు జరుగుతున్నాయి.. ఈ మేరకు వీసీ ప్రసన్న శ్రీ పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు. కంగారుపడకుండా పరీక్షలు రాయాలని.. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. కాకినాడలోని వీఎస్ లక్ష్మి, ప్రగతి డిగ్రీ కళాశాలల్లో గురువారం ఇలా ఆకస్మిక తనిఖీలు చేశారు.

ఇసుక రవాణాకు కొత్త కష్టాలు

మొరాయించిన డివైడర్లు.. వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ర్యాంపుల్లో డివైడర్లు మొరాయించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఇసుక రవాణాకు సంబంధించి నూతన విధానాన్ని అమలు చేసింది. ఇసుక రవాణాచేసే వాహనాన్ని ముందుగా ఫొటో తీయాలి. వివరాలు రిజిస్ట్రేషన్, ఇసుక లోడింగ్ చేసుకున్న తరువాత మరోసారి వాహనం ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. దీంతో పాటు నూతన ప్రక్రియలో వీఆర్వో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో డివైడర్‌లు మొరాయిండం, వీఆర్వోలు లాగిన్ అవ్వక పోవడంతో మధ్యాహ్నం వరకు బిల్లులు మంజూరు కాక ఇసుక రవాణాకు అడ్డంకిగా మారింది. మధ్యాహ్నం 12 గంటలకు వరకు ఇసుకకు వచ్చిన లారీలన్నీ ర్యాంపుల్లోనే నిలిచిపోయాయి. మండలంలోని వాడపల్లి ర్యాంపులో బిల్లులు జనరేట్ కాకపోవడంతో ఇసుకకు వచ్చిన లారీలు వెనుదిరిగాయి. కుమారదేవం ఓపెన్ రీచ్‌లో సాయంత్రం వరకు బిల్లులు మంజూరు కాలేదు. కొవ్వూరు, ఎరినమ్మ, ఔరంగాబాద్, ఆరికిరేవుల, దండకుంట ర్యాంపుల్లోనూ ఇదే సమస్య తలెత్తింది. వాడపల్లి, కుమారదేవం ర్యాంపుల వద్ద లారీలు బారులు తీరాయి.బిల్లులు మంజూరుకు సంబంధించి డివైడర్లలో సాంకేతిక సమస్యలతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం నుంచైనా నూతన విధానం సక్రమంగా అమల్లోకి రావాలని నిర్వాహకులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు.



నిడదవోలు 'మున్సిపల్'లో 12కు చేరిన జనసేన బలం


మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేనలో చేరిన వైకాపా కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్

నిడదవోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘాన్ని జనసేన కైవసం చేసుకోనుంది. చైర్మన్ భూపతి ఆదినారాయణతో పాటు తొమ్మిది మంది కౌన్సిలర్లు జనసేనలో చేరగా, సోమవారం మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు చేరారు. ఇదే బాటలో గురువారం వైసీపీకి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్ మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో జనసేన బలం 12కు చేరింది. త్వరలో జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంలో వైసీపీని ఢీకొట్టి చైర్మన్ కుర్చీని జనసేన కైవసం చేసుకునే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

7న ఎంపీ పురందేశ్వరి 'నల్లజర్ల'లో పర్యటన

నల్లజర్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలో ఈనెల 7వ తేదీన రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పర్యటిస్తారని టీడీపీ సీనియర్ నేత, ప్రకాశరావుపాలెం ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మారాజు గురువారం విలేఖర్లకు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చూడాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవికి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామ పంచాయతీకి స్పేర్ మోటార్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ కుమారి, ఈవోపీఆర్‌డీ రాజారావు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన కొవ్వూరు నాయకులు


విజయవాడలో మాజీ సీఎం జగన్‌తోపాటు ఉన్న వైసీపీ నేతలు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్‌ని కొవ్వూరు నాయకులు గురువారం విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీటీసీల చాంబర్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, తోట రామకృష్ణ ఉన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలి


సమావేశంలో డీఎల్‌పీవో, ఎంపీడీవో

తాళ్లపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయిన గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. గురువారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కానుమిల్లి వెంకన్నదొర తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక విమలమ్మ హాస్పిటల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన కుమార్తె డాక్టర్ అచ్యుత కృష్ణవ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్, యర్రా మల్లేశ్వరరావు, ఆనెం చిన్ని, ఆనెం చంటి, పితాని సత్యనారాయణ, గుత్తుల బాబీ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి : జేసీ



రీసర్వే గ్రామసభలో మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు, హాజరైన ఆర్డీవో, తదితరులు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులంతా సహకరించాలని జేసీ ఎస్. చిన్నరాముడు అన్నారు. దొమ్మేరులో సర్పంచ్ తానేటి కుమారి అధ్యక్షతన గురువారం రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఆర్డీవో డా. రాణీసుస్మిత, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పురవీధుల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో రీసర్వే జరుగుతున్నప్పుడు సర్వే జరిగే భూమికి సంబంధించిన రైతులు, పక్క సర్వేనెంబర్‌లోని రైతులు దగ్గరున్నట్టయితే ఎటువంటి సమస్యలు, వివాదాలు ఉండవన్నారు. గతంలో వీఆర్వోలు, సర్వేయర్లకు గ్రామాలలో రైతుల వివరాలు తెలిసేవి. నేడు సచివాలయ కార్యదర్శులు అంతా యూత్ బాగా చదువుకున్న వారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి భూముల సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. సర్వే సిబ్బందికి భూమి యజమాని క్షేత్రస్థాయిలో హద్దులు చూపించినట్లయితే ఎటువంటి సమస్యలు తలెత్తవన్నారు. ఆర్డీవో డా. రాణీసుస్మిత మాట్లాడుతూ ఏ రోజు సర్వే చేస్తున్నది రైతులకు ముందుగా నోటీసులు అందించి, సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు. సర్వేకి రైతులంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం


పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పాదచారులకు సహాయమందించే దిశగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మజ్జిగ చలివేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెల్లా రాజబాబు అన్నారు. గురువారం పట్టణంలోని దుర్గాస్టూడియో వద్ద ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిసనర్ టి. నాగేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగేంద్రకుమార్, గెల్లా రాజబాబు మాట్లాడారు. అనంతరం కమిషనర్‌ను ఫొటోగ్రాఫర్స్ సంఘం నాయకులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఉండవల్లి అప్పన్నశ్రీను, పోకల రవి, శశాంక్, డి. శ్రీనివాస్, గెల్లా సాగర్, బి. పోసిరత్నం, పోకల బరీష్, సురేష్, విజయ్, శివాజీ, కిరణ్ మెడికల్స్ పోకల మధు, మద్దుల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నిడదవోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురు వారం ఓసీ, బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో డీ. లక్ష్మీనారాయణ, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఈనెల 4,5 తేదీల్లో బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీఎస్ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల సెంటర్‌లో వెలసిన పుంతలో మునలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునః నిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నాలుగు రోజులుగా వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రారంభం, తదితర కార్యక్రమాలు సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దళితజాతికి అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఇద్దరూ రెండు కళ్లు

• పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


అరుంధతీయులు అసామాన్యులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దళిత జాతికి అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఇద్దరూ రెండు కళ్ల లాంటివారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తాళ్లపూడి మండలం పైడిమెట్టకి చెందిన విజేత పబ్లిక్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జొన్నకూటి వెంకట ప్రమోద్‌కుమార్ రచించి, ముద్రించిన అరుంధతీయులు అసామాన్యులు పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రమోద్‌కుమార్ ఉపాధ్యాయుడిగా, కవిగా, రచయితగా, ప్రచురణకర్తగా, జర్నలిస్టుగా బహుముఖ ప్రాత పోషిస్తూ దేశంలోని బడుగు, బలహీనవర్గాల కోసం పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. సమాజశ్రేయస్సు, సంక్షేమం, దళితుల అభివృద్ధికి సంబంధించి ఇంకా మరెన్నో పుస్తకాలు ఆవిష్కరించాలన్నారు. ఇటువంటి పుస్తకాలు భావితరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, కారుపాటి ధన రాజ్‌కుమార్, మాజీ జిల్లా జడ్జి కే. గాంగేయుడు. యటి. సల్మాన్‌రాజు, జీ. వినోద్, ఎస్. కాంతారావు, పీ. ప్రవీణ్, చిన్నం హరి, ఎం. శ్రీనువాసు, పసలపూడి హరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

దేవరపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసారాన్ని పెంపొందించుకుని ప్రకృతి వ్యవ సాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మాదవ రావు పేర్కొన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు సంబం ధించి ఖరీఫ్ 2025 యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ తరగతులు దేవరపల్లిలో పొగాకు బోర్డు రైతు భవనంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, ఈపీఎం తాతారావు, మండల వ్యవసాయాధి కారులు విజయ్, కమల్‌రాజు, రాజారావు, ఏడీపీవో వలీ, మహిళా సామాఖ్య అధ్యక్షురాలు గద్దే రమాదేవి, మండలంలోని ఆదర్శ రైతులు గద్దే మునేశ్వరరావు, చాపల సత్యవతి, పిచ్చుకల బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉగాది ఉత్సవాలు


కొవ్వూరమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉగాది ఉత్సవాలు ఘనంగా గురువారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు విశేషపూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే మెయిన్‌రోడ్‌లో వేంచేసియున్న పుంతలో మునలమ్మ వారి ఆలయం, రెల్లిపేటలోని నూకాలమ్మ ఆలయాల్లో ఉగాది ఉత్సవాలు ముగిశాయి. ఈ సందరంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్ఐ


వర్తకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్ర

చాగల్లు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వర్తకులు తమ షాపుల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ కే. నరేంద్ర అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వర్తకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా వర్తకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండలంలోని వర్తక సంఘాలవారు, దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని మహిళ మృతి

గోపాలపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఓ మహిళ మృతిచెందింది. ఈసంఘటన సంజీవపురం పంచాయతీ పరిధి నందిగూడెంలో బుధవారం రాత్రి చేటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు .. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలు నందిగూడెం గ్రామశివారు కాకర్ల దివాకర్, సంజీవ్ కుమార్‌కు చెందిన కోళ్లఫాంలో పనిచేస్తున్నారు. గత సంవత్సర కాలంగా ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో సతామి కోటల్ (30) అనే మహిళ భర్త సునీల్ కోటల్ ఈ నెల జీతంలో మొదటి భార్యకు రూ. ఐదు వేలు పంపించడంతో మనస్థాపానికి గురైన సతామి కోటల్ తాము నివాసముంటున్న గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కోళ్లఫాం యాజమాని ఇచ్చిన సమాచారం మేరకు నందిగూడెం వీఆర్వో కొత్తపల్లి రాంబాబు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, చెల్లిపై దాడి ఘటనలో.. అన్న, వదినపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని కొట్టి గాయపర్చిన అన్న, వదినపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ వి. లలిత తెలిపారు. పట్టణంలోని అచ్చయమ్మకాలనీకి చెందిన మిండల లక్ష్మీ తల్లికి రూ. 50 వేలు అందాయని తెలుసుకున్న అన్న గంగరాజు, అతని భార్య ముత్యమ్మ ఇంటికి వచ్చారు. గంగరాజు తల్లిని రూ. 50 వేలు కావాలని అడిగాడు, దీంతో ఆమె నిరాకరించడంతో తల్లిని, చెల్లిని గంగరాజు, ముత్యమ్మ ఇటుకరాయితో కొట్టి గాయపర్చారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. మిండల లక్ష్మీ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

వాడపల్లి బెల్లపు బట్టీల్లో విజిలెన్స్ తనిఖీలు

• రూ. 38 లక్షల విలువైన పంచదార, బెల్లం, రసాయనాలు స్వాధీనం


వాడపల్లిలో బెల్లపు బట్టీల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి, బంగారంపేటలోని బెల్లపు బట్టీలపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. బట్టీల్లో కల్తీ జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ అధికారి ఎన్. స్నేహితకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ టీ. తాతారావు పర్యవేక్షణలో రెండుబృందాలుగా విడిపోయి పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నట్టు గుర్తించారు. రూ. 38 లక్షల విలువైన పంచదార, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 36,500 కేజీల పంచదార, 2324 కేజీల నాసిరకం బెల్లం, బంగారంపేటలో 2800 కేజీల పంచదార, 486 కేజీల నాసిరకం బెల్లంతో పాటు బెల్లం తయారీలో ఉపయోగించే నిషేధిత రంగులు, ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్లపు తయారీకి పొయ్యిలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి తగలబెడుతున్నట్టు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బెల్లం, పంచదారను పరీక్షల నిమిత్తం లాబ్‌కు పంపిస్తున్నామన్నారు. వాటి నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ మధుబాబు మాట్లాడుతూ కొవ్వూరు పరిసర ప్రాంతాలలో బెల్లం తయారీలో కల్తీ జరుగుతుందని విజిలెన్స్ రీజనల్ అధికారి ఎన్. స్నేహితకు సమాచారం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాడపల్లిలో బండి శ్రీనివాసరావు బెల్లపుబట్టీ, బంగారంపేటలో ఆనందరావు తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా బంగారంపేటలో నిర్వహిస్తున్న బెల్లపు బట్టీపై విజిలెన్స్ ఏజీ లక్ష్మీనారాయణ, ఫుడ్ రెండవ బృందం వాడపల్లి ఆనందరావు బెల్లపు బట్టీలో గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలు బెల్లపు తయారీలో వినియోగించినట్టయితే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ మధుబాబు, టి. నాగ వెంకటరాజు, ఫుడ్ స్టేఫ్టీ అధికారి రుత్తయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి ప్రసాద్, కార్మికశాఖ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లం, పంచదారను రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

సారాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి

ఉండ్రాజవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్. జయరామ్ పేర్కొన్నారు. గురువారం తాడిపర్రులో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సారా రహిత గ్రామాలు అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై బాలాజీ, గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, ఉపసర్పంచ్ వీరభద్రం, పంచాయతీ కార్యదర్శి పి. మునలయ్య, వార్డు సభ్యులు, పోలీస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్యాంకర్ లారీ

• తప్పిన పెను ప్రమాదం
• సురక్షితంగా బయట పడిన కూలీలు


హైవేపై బోల్తా పడ్డ మొక్కజొన్న బొండ్ల ట్రాక్టర్

నల్లజర్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దొండపూడి నుంచి దేవరపల్లి, నల్లజర్ల మీదుగా తాడేపల్లి గూడెంకి మొక్కజొన్న బొండ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను అదే మార్గంలో వస్తున్న ట్యాంకర్ ఢీకొనడంతో బోల్తాపడింది. వివరాలివి. దొండపూడి నుంచి మొక్కజొన్న బొండ్లను లోడ్ చేసుకుని తాడేపల్లిగూడెంలోని ఒక ఫ్యాక్టరీలో విక్రయించేందుకు ట్రాక్టర్ గురువారం బయలు దేరగా, అనంతపల్లి శివారు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కూలీలంతా సురక్షితంగా బయట పడ్డారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తికావాలి

• గూగుల్ మీట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు మే నెలాఖరు నాటికి నూరుశాతం నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం మండలం, డివిజన్, నియోజవర్గాల అధికారులు, ప్రత్యేక అధికారులతో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీఎస్ భాస్కర్ రెడ్డితో కలిసి గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 31 నాటి కల్లా జిల్లాలో 10,794 ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, హౌసింగ్ ఐటీ పర్సన్ టీ. విద్యాసాగర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రముఖ బహుళ జాతి ఫార్మా కంపెనీ లారెస్ ల్యాబ్స్ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9-30 గంటలకు ఎంఎస్సీ, బీఎస్సీ రసాయనశాస్త్రం, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ సబ్జెక్ట్‌లో 2024-25 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే విద్యార్థులు బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

సంతాన వేణుగోపాల స్వామి వార్షికోత్సవవేడుకలు


వెలసిన స్వామివారు

నల్లజర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కవులూరు ప్రధాన రోడ్డు పక్కన ఉన్న సంతాన వేణు గోపాలస్వామి ప్రథమ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అలపాటి సూర్యరావు, బేతిన కృష్ణారావు, వీరంకి దుర్గారావు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. వేదపండితులు జీవీఎల్ఎన్ మూర్తి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. బేతిన రాంబాబు ఆధ్వర్యంలో హరేశ్రీనివాస భజన మండలి కోలాటం నిర్వహించారు.

నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

• కూటమి ప్రభుత్వంతో సంస్కృతి, కళలకు పునరుజ్జీవం
• ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
• అన్ని ఏర్పాట్లు పూర్తి.. 500కి పైగా కళాకారుల నమోదు
• కళలకు కాణాచి రాజమహేంద్రవరం
• ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలి.. ప్రవేశం ఉచితం
• రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైరపర్సన్ తేజస్వి


పోలీసులకు సూచనలిస్తున్న సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి వంటి రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు సెంట్రల్ జైలు రోడ్డులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తిలకించాలని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి పేర్కొన్నారు. ఏర్పాట్లను గురువారం ఆమె స్వయంగా పరిశీలించి పోలీసు తదితర శాఖల అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సంస్కృతి, కళలకు పునరుజ్జీవం వచ్చిందన్నారు. వాటికి పూర్వ వైభవం తీసుకురావాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. సెంట్రల్ జైలు రోడ్డులో శుక్రవారం నిర్వహిస్తున్న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు 500 మంది కళాకారులు నమోదు చేసుకున్నారన్నారు.వారి చిత్రకళలు ప్రదర్శనలో ఉంటా యన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటా రని తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళలు, సంప్రదాయాలకు ఆద రణ లభించలేదని, వాటి పునరుద్ధరణకు ఎలాంటి ప్రయత్న మూ జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎంతో గొప్ప కళాకారులు, పద్మ అవార్డుల వంటి ఉన్నత పురస్కారాల గ్రహీతలకు సైతం అప్పట్లో సముచిత గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కమిషన్ డైరెక్టర్ అండ్ సీఈవో ఎం.మల్లిఖార్జునరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిత్ర కళా ప్రదర్శన ప్రదేశం: సెంట్రల్ జైలు రోడ్డులో సెంట్రల్ జైలు వద్ద నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌లో.

సమయం: ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రవేశం ఉచితం.

• ట్రాఫిక్ ఆంక్షలు

వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ జంక్షన్ వరకూ సెంట్రల్ జైలు రోడ్డులో శుక్రవారం రాత్రి 10 గంటల వరకూ వాహనాలకు అనుమతి ఉండదు. లాలాచెరువు వైపు నుంచి వచ్చే కార్లు, బస్సులు తదితర వాహనాలు సీటీఆర్ఐ, క్వారీ మార్కెట్, మార్కెట్ యార్డు రోడ్, కంబాల చెరువు గుండా ఆర్ట్స్ కళాశాల చేరుకొని పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలు సీటీఆర్ఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కి అడ్డం లేకుండా నిలపవచ్చు. కంబాల చెరువు నుంచి లాలా చెరువు వెళ్లే వాహనాలు మార్కెట్ యార్డు రోడ్డులో క్వారీ మార్కెట్ సెంటర్‌కి వెళ్లి అక్కడి నుంచి లాలా చెరువు చేరుకోవాలి.